RNI No.TELTEL/2016/68720

ప్రజలకోసం పోలీస్

# పోలీస్ నిఘా
POLICE NIGAH
తెలుగు దినపత్రిక

Published from Rangareddy, (Circulated) by Hyderabad, Rangareddy, Nalgonda, Mahabubnagar, Sangareddy, Vikarabad, Medak, Siddipet, Karimnagar, Sirisilla(Vemulawada), Nizamabad, Warangal, Yadadri Bhonagiri, Nirmal, Adilabad

రంగారెడ్డి | సంపుటి : 10 | సంచిక : 167 | ఎడిటర్: కేమోజు శ్రీనివాస్ | గురువారం 19-03-2026 | వెల: రూ.5/- | పేజీలు: 8

పోలీస్ నిఘా POLICE NIGAH తెలుగు దిన & మాస పత్రిక
పోలీస్ నిఘా POLICE NIGAH Web NEWS TV
రెండు తెలుగు రాష్ట్రాల్లో రిపోర్టర్స్ కావలెను
Contact : 9133613813







**సెలవు**

ఉగాది సందర్భంగా మా కార్యాలయానికి గురువారం సెలవు. కావున శుక్రవారం (20-03-2026) 'పోలీస్ నిఘా' సంచిక వెలువడదు. పునర్దర్శనం శనివారం.

# అసెంబ్లీకి కేసీఆర్ రావాలి.. సూచనలు, సలహాలు ఇవ్వాలి


## సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 18 (పోలీస్ నిఘా) : గవర్నర్ ప్రసంగం ద్వారా రాష్ట్ర భవిష్యత్తు ప్రణాళికలు వివరించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గవర్నర్‌తో చర్చించిన తర్వాతే ప్రసంగాన్ని తయారు చేశామన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో సీఎం మాట్లాడారు. "రాజులు పోయినా.. రాజ్యాలు పోయినా.. రాచరికపు పోకడలు పోలేదు. కొందరు ఇంకా తమను తాము రాజులుగా భావిస్తున్నారు. నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అదే అహంకార ధోరణి.. లేనప్పుడూ అదే ధోరణి" అని ప్రతిపక్షంపై మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే నాయకులని పేర్కొన్నారు. "కొత్త గవర్నర్‌ను కలిసేందుకు ప్రతిపక్ష నేత వస్తారనుకున్నాం. ప్రధాన ప్రతిపక్షం కూడా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతుందనుకున్నాం. గవర్నర్ ప్రసంగంపై సూచనలు, సలహాలు వస్తాయనుకున్నాం. ప్రధాన ప్రతిపక్షం నుంచి కనీస స్పందన రాలేదు. కేసీఆర్ సభకు రావాలని కోరుకుంటున్నాం. ఆయన సభలో పాల్గొని సూచనలు, సలహాలు ఇవ్వాలి. ప్రపంచ దిగ్గజ ఐటీ కంపెనీలు హైదరాబాద్‌లో ఏర్పాటయ్యేందుకు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విధానాలే కారణం. పీవీ, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి తొలిసారి హైటెక్ సిటీకి పునాది రాయి వేశారు. అనంతరం చంద్రబాబు, వాజ్‌పేయీ హైటెక్ సిటీని పూర్తి చేశారు. ప్రస్తుతం ఏఐ ద్వారా లక్షలాది ఉద్యోగాలు పోయి నిరుద్యోగ సమస్య తలెత్తే పరిస్థితి. ఈ పరిస్థితుల్లో మనం భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవాల్సి ఉంది. సవాళ్లను ఎదుర్కోవడంపై విజన్ డాక్యుమెంట్‌ను సభలో ప్రవేశపెట్టాం. ముందు చూపులో భాగంగానే హైదరాబాద్‌లో చెరువులను పునరుద్ధరిస్తున్నాం. కబ్జాల చెర నుంచి విడిపించి పునరుజ్జీవం చేస్తున్నాం. నాలాల్లో ఆక్రమణలను తొలగించి.. ముంపు



సమస్యను పరిష్కరిస్తున్నాం. హైదరాబాద్‌లో నాలాలపై 28 వేల అక్రమ కట్టడాలు ఉన్నాయని గతంలో కేసీఆర్ అన్నారు. వాటిని నిర్దాక్షిణ్యంగా కూల్చాలని గతంలో కేటీఆర్ ఆదేశాలు ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కార్యాచరణనే కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోంది. భాజపా నేతలు సబర్మతి, గంగా, యమునా నదుల ప్రాజెక్టుల గురించి గొప్పగా చెప్తున్నారు. కానీ, మూసీ ప్రాజెక్టును మాత్రం తప్పుపడుతున్నారు. మూసీ పరివాహకంలో ఎవరి అనుచరులు క్రికెట్ మైదానాలు నిర్మించారో ప్రజలకు తెలుసు. హైదరాబాద్‌లో మూడు వేల ఎలక్ట్రికల్ బస్సులు నడిపి కాలుష్యం తగ్గిస్తాం. పెట్రోల్, డీజిల్ ఆటోలనూ ఈవీలుగా మార్చే కార్యాచరణ చేపడుతున్నాం. మెట్రోను విస్తరించేందుకు కష్టపడుతున్నాం. నగరానికి మూడు బుల్లెట్ రైళ్లు రానున్నాయి" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

### ఇరాన్ కోలుకోవడానికి పదేళ్లు పడుతుంది: డొనాల్డ్ ట్రంప్



8లో

# మూసీ నిర్వాసితులకు అదే ప్రాంతంలో అపార్టుమెంట్: భట్టి విక్రమార్క

హైదరాబాద్, మార్చి 18 (పోలీస్ నిఘా) : మూసీ పునరుజ్జీవం ఒక సామాజిక బాధ్యత.. మురుగు నీరు, ఈగలు, దోమలు, రోగాల మధ్య దయనీయ పరిస్థితుల్లో బతుకుతున్న పేదల జీవితాలను మార్చాలనేదే ప్రభుత్వ సంకల్పం అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మూసీపై బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చిట్‌చాట్‌కు ఆయన అసెంబ్లీలో కౌంటర్ ఇచ్చారు. మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటున్న వారు పేదలు అదే మురికి కూపంలో ఉండాలని కోరుకుంటున్నారా అని ప్రశ్నించారు. నివాసాలు కోల్పోయే ప్రతి పేద కుటుంబానికి పట్టా ఉన్నా లేకపోయినా అదే ప్రాంతంలో అపార్ట్మెంట్లు నిర్మించి ఇస్తామని ముఖ్యమంత్రి ఇప్పటికే స్పష్టం చేశారన్నారు. అంతేకాకుండా అక్కడి మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించి వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తామని, వారి పిల్లల కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించి ఉజ్వల భవిష్యత్తును అందిస్తామని వివరించారు. హైదరాబాద్ నగరానికి మణిహారంగా మూసీని తీర్చిదిద్దుతుంటే ప్రతి అడుగులో అడ్డుపడటం సరికాదన్నారు. పేదవాడు పేదవాడిగానే ఉండాలి, మురికిలోనే బతకాలి అనే ధోరణి ప్రతిపక్ష పార్టీ నాయకులు వీడాలని ఆయన హితవు పలికారు. ఈ మహా యజ్ఞం ద్వారా మూసీ పరివాహక ప్రాంతాల ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు



ప్రభుత్వం కట్టుబడి ఉందని, మూసీ నది ప్రక్షాళన దిశగా ఈ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు అత్యంత పారదర్శకంగా ఉన్నాయని, నదిలోకి వచ్చే ప్రతి నాలా వద్ద ఎస్టీపీలను ఏర్పాటు చేసి మురికినీటిని పూర్తిగా శుద్ధి చేసిన తర్వాతనే మూసీలోకి గోదావరి నీటిని వదులుతామని తమ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌లో చాలా స్పష్టంగా వివరించామని చెప్పారు. దీనిపై ప్రజల నుంచి, మేధావుల నుంచి వచ్చే మెరుగైన సలహాలను, సూచనలను పరిగణనలోకి తీసుకోవడానికి తమ ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు.

మిగతా 2లో

# ఏప్రిల్, మేలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు

## వచ్చే రెండు, మూడు నెలల్లో డిజిటల్ మీడియా పాలసీని తెస్తాం: మంత్రి పొంగులేటి



హైదరాబాద్, మార్చి 18 (పోలీస్ నిఘా) : పేదవాడి ఆత్మ గౌరవానికి చిహ్నంగా నిలిచే ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం ఒకసారి చేసే కార్యక్రమం కాదని, ప్రతి సంవత్సరం కొనసాగించే శాశ్వత ప్రక్రియగా ప్రభుత్వం అమలు చేస్తోందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబధాల శాజల మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మాయమాటలు చెప్పదని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని ఆచరణలో చూపిస్తుందని అన్నారు. రాబోయే మూడేళ్లలో పట్టణ ప్రాంతాల్లోని ప్రతీ వార్డులో ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామని ప్రకటించారు. శాసనమండలిలో మంగళవారం హౌసింగ్‌పై పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. 'ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో రెండో విడత ఇళ్ల మంజూరు కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తామన్నారు.

మిగతా 2లో

# 2029లోనే అసెంబ్లీ ఎన్నికలు

## డ్రగ్స్ ఫ్రీ తెలంగాణే లక్ష్యం: సీఎం రేవంత్‌రెడ్డి



న్యూఢిల్లీ, మార్చి 18: తెలంగాణ రాజకీయ భవిష్యత్తు మరియు రాష్ట్రంలో సంచలనం రేపుతున్న డ్రగ్స్ కేసులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన, బుధవారం మీడియాతో చిట్‌చాట్ చేస్తూ పలు ఆసక్తికర అంశాలను పంచుకున్నారు. రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు వస్తాయన్న ఊహాగానాలకు సీఎం చెక్ పెట్టారు. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే 2028లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం కనిపించడం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. జాతీయ స్థాయి పరిణామాలు, నియోజకవర్గాల పునర్విభజన వంటి అంశాల నేపథ్యంలో 2029లోనే ఎన్నికలు జరిగే సూచనలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

**మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై సీరియస్..**

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని ఫామ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి అత్యంత కఠినంగా స్పందించారు. ఈ కేసు తీవ్రత దృష్ట్యా ఇప్పటికే 9 మంది అధికారులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. "ఈ కేసులో ఏలూరు ఎంపీ (పుట్టా మహేష్ కుమార్) పట్టుబడ్డారు. ఆయన స్టేషన్ బెయిల్ మీద బయట తిరుగుతున్నారు. ఇందులో మా ప్రభుత్వ ప్రమేయం ఏమీ లేదు, చట్టం తన పని తాను చేసుకుపోతుంది" అని స్పష్టం చేశారు.

**డ్రగ్స్ ఫ్రీ తెలంగాణే లక్ష్యం..**

"తెలంగాణను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా మార్చడమే మా ప్రభుత్వ లక్ష్యం. డ్రగ్స్ విషయంలో ఎంతటి వారైనా సరే, ఉక్కుపాదంతో అణిచివేస్తాం. ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు" అని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలోని లోపాలను సరిదిద్దుతూ, వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని ఆయన చెప్పుకొచ్చారు.

# మూసీ ప్రక్షాళన పేరుతో లక్షన్నర కోట్ల దోపిడీ



- డిపిఆర్ లేదు..ప్రణాళిక లేకుండా ఎలా?
- మూసీ ప్రక్షాళనపై స్పష్టత లేని ప్రభుత్వం
- పేదల ఇళ్లు కూల్చివేత దారుణం
- బఫర్ జోన్ నిర్ణయంలోనూ అస్పష్టత
- అసెంబ్లీలో మూసీ ప్రక్షాళనపై నిలదీసిన కెటిఆర్
- ప్రభుత్వ తీరుకు నిరసనగా బిఆర్ఎస్ వాకౌట్

హైదరాబాద్, మార్చి 18 (పోలీస్ నిఘా) : మూసీ నది ప్రక్షాళనకు తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని, అయితే ప్రభుత్వం మూసీ ప్రాజెక్ట్ పేరుతో లక్షన్నర కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడుతున్నందున దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా బుధవారం అసెంబ్లీ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ మేరకు అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. అసెంబ్లీలో మూసీ ప్రక్షాళనపై బీఆర్ఎస్ సభ్యులు అడిగిన ప్రశ్నకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన దాటవేసే ధోరణిలో సమాధానం ఇవ్వడంపై కేటీఆర్ మండిపడ్డారు. ప్రభుత్వం దగ్గర పైసలు లేవు.. ప్రణాళికలు లేవని విమర్శించారు. మూసీ ప్రక్షాళనకు మేం వ్యతిరేకం కాదు.. లక్షన్నర కోట్ల దోపిడీకి మాత్రమే వ్యతిరేకమని స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళనపై అసెంబ్లీలో బుధవారం జరిగిన చర్చ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కేటీఆర్ పలు ప్రశ్నలు సంధించారు. మూసీ ప్రాజెక్టు కోసం రుణం మంజూరైందని గతంతో మంత్రి చెప్పారని తెలిపారు. డీపీఆర్ కూడా సబ్‌మిట్ చేయలేదని అప్పుడు ఏడీబీ చెప్పిందని పేర్కొన్నారు. రుణం మంజూరు కాలేదని ఈ నెల 11వ తేదీన ఏడీబీ లేఖ ఇచ్చిందన్నారు.

మిగతా 2లో

# గవర్నర్ ప్రసంగం హామీల ఎగవేత డిక్లరేషన్‌గా ఉంది: ఏలేటి మహేశ్వర్ రెడ్డి



హైదరాబాద్, మార్చి 18 (పోలీస్ నిఘా) : రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ ప్రసంగంలో అబద్ధాలు చెప్పించిందని భాజపా శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. గవర్నర్ ప్రసంగం హామీల ఎగవేత డిక్లరేషన్‌గా ఉందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సొంత డబ్బా కొట్టుకుంది తప్పితే.. అభివృద్ధికి సంబంధించిన దిశా దశ లేదని ఎద్దేవా చేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడారు. "అప్పుల కుప్పలా రాష్ట్రం ఉంటే మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుతుందని భ్రమలు కల్పిస్తున్నారు. ఇది ఎట్లా సాధ్యమో చెప్పాలి. రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లు 5 శాతం పడిపోయాయి. ఆర్థిక క్రమశిక్షణ లేని.. అప్పుల జాతర రాష్ట్రంలో నడుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి పాలన రైతుల పట్ల యమపాశంగా మారింది. ఉత్తర తెలంగాణలో జరిగిన పంట నష్టానికి పరిహారం ఇంత వరకూ ఇవ్వలేదు. రైతు భరోసా కోసం రైతులు ఎదురు చూస్తున్నారు" అని అన్నారు.

# తెలంగాణ సీఎస్ పదవీ కాలం మరోసారి పొడిగింపు



హైదరాబాద్, మార్చి 18 (పోలీస్ నిఘా) : తెలంగాణ సీఎస్ కె.రామకృష్ణారావు పదవీ కాలాన్ని కేంద్రం మరోసారి పొడిగించింది. ఆయన పదవీ కాలం పొడిగించాలన్న రాష్ట్ర ప్రభుత్వ వినతికి కేంద్రం అంగీకారం తెలిపింది. మరో మూడు నెలలు పొడిగించింది. గతేడాది ఏప్రిల్ 30న సీఎస్‌గా రామకృష్ణారావు బాధ్యతలు చేపట్టారు. అదే ఏడాది ఆగస్టులోనే ఆయన పదవీ విరమణ చేయాల్సింది. అప్పుడు ఏడు నెలలు పొడిగించింది. ఇప్పుడు మరోసారి పొడిగింపుపై కేంద్రం నిర్ణయం తీసుకుంది.



## బాలాజీ విద్యాసంస్థల్లో ఘనంగా ఉగాది-రంజాన్ వేడుకలు




నర్సంపేట, మార్చి 18 (పోలీస్ నిఘా) : బాలాజీ విద్యాసంస్థల్లో భాగమైన అక్షర ధ స్కూల్ లో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డా:వనజ రాజేంద్రప్రసాద్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉగాది పండగ రోజు నుండి కొత్త సంవత్సరం మొదలవు తుందన్నారు.తెలుగువారు మొదటి పండుగ ఉగాది రోజున కొత్తగా పనులు ప్రారంభించటం పరిపాటి అన్నారు. ఉగాది పచ్చడి ఈ పండుగకు ప్రత్యేకమైన దని అన్నారు. సంవత్సరం పొడుగునా ఎదురయ్యే మంచి చెడులను కష్ట సుఖాలను సంయమనంతో స్వీకరించాలన్న సందేశాన్ని ఉగాది పచ్చడి మనకు తెలియజేస్తుందని అన్నారు. తదుపరి ముస్లిం సోదరులకు పవిత్రమైన పండుగ రంజాన్ అని వారి పవిత్ర గ్రంథం ద్వారా ఖురాన్ అవతరించిదన్నారు.రంజాన్ మాసంలోనే పండుగను సంతోషం గా జరుపుకుంటారు.పండగలో వారు ఉపవాసం ఉండి ఈద్-ఉల్ -ఫితర్ అని రంజాన్ పండుగ జరుపుకుంటరాని వివరించారు.ఈ సందర్భంగా అందరికీ ఉగాది -రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు .ఈ వేడుకలో విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో అలరించారు. ముస్లిం విద్యార్థులందరికీ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## వారం రోజులపాటు వర్ష సూచన

### పంటల కోతలను వాయిదా వేసుకోవాలి

### చెన్నారావుపేట ఏవో చిట్టి రెడ్డి గోపాల్ రెడ్డి



చెన్నారావుపేట, మార్చి 18 (పోలీస్ నిఘా) : వరంగల్ జిల్లాకు అనగాతేదీ18.03.2026 నుండి వారం రోజుల పాటు వర్ష సూచన ఉందని వాతావరణ శాఖ వెల్లడించినందున, ఇదివరకే కోసిన మొక్క జొన్న కంకులను, ఎండు మిరప & ఇతర పంట ఉత్పత్తులను జాగ్రత్తగా, పకడ్బందీగా తడవకుం డా టార్పాలిన్ లతో కప్పగలరు.అలాగే ఇంకా కోయనటువంటి మొక్కజొన్న, మిరప మరియు ఇతర పంటలను, కోత వాయిదా వేసుకొని, వర్షం పూర్తిగా తగ్గిన తర్వాత పంటలను కోసుకోవల సినదిగా రైతాంగానికి చెన్నారా వుపేట ఏవో చిట్టి రెడ్డి గోపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## యాదగిరిగుట్టలో దళిత ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వాలి

### - డైరెక్టర్‌ను ఆశ్రయించిన సంఘాలు-



యాదగిరిగుట్ట, మార్చి 18 (పోలీస్ నిఘా) :యాదగిరిగుట్టలోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి దేవస్థానంలో దళిత వర్గాల ఉద్యోగులకు రావాల్సిన ప్రమోషన్లు ఇవ్వడం లేదని దళిత సంఘాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై వెంటనే చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరుతూ తెలంగాణ దేవాదాయ ధర్మాదాయ శాఖ నూతన డైరెక్టర్ ఎం. హనుమంతు రావును కలిసి వినతిపత్రం సమర్పించారు.గత కొన్ని నెలలుగా దళిత వర్గాల ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వకుండా నిలిపివేస్తున్నారని, అదే సమయంలో ఇతర సామాజిక వర్గాలకు చెందిన ఉద్యోగులకు ప్రమోషన్ ఆర్డర్లు జారీ చేస్తున్నారని వారు ఆరోపించారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి, అర్హులైన దళిత ఉద్యోగులకు వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.యాదగిరిగుట్ట దేవస్థానంలో దళిత ఉద్యోగులు, ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఈ సందర్భంగా దేవాదాయ శాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం. హనుమంతు రావును శాలువాతో సన్మానించి, శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి వారి ప్రసాదం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్రస్వామి మాదిగ, దళిత ఐక్యవేదిక చైర్మన్ భట్టు రాంచంద్రయ్య మాదిగ, ఎంఎస్పీ జాతీయ నాయకులు మంద శంకర్ మాదిగ, జర్నలిస్ట్ సంఘం నాయకులు, వినియోగదారుల ఫోరమ్ నాయకులు ఎలిమినేటి నగేష్ పాల్గొన్నారు.

## పరిశుభ్రతే ప్రగతి దారి: చైర్‌పర్సన్ సమతా వెంకట్ రెడ్డి




చేవెళ్ల, మార్చి 18 (పోలీస్ నిఘా) : ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచితేనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమవుతుందని చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంల మునిసిపల్ కమిషనర్ వెంకటేశం, వైస్ చైర్‌పర్సన్ రాము గౌడ్, వార్డ్ కౌన్సిలర్లు శైలజఆగిరెడ్డి, శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, ముడవత్ కృష్ణ నాయక్‌లతో కలిసి 11, 17వ వార్డులైన ఇబ్రహీంపల్లి, రంగారెడ్డి కాలనీలలో సమతావెంకట్ రెడ్డి పర్యటించారు. 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ సిబ్బంది, స్థానికులతో కలిసి వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి కాలనీలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రతి కుటుంబం తమ బాధ్యతగా స్వచ్ఛతను పాటించాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది శ్రమదానంతో వీధులు, కాలనీలలో శుభ్రత పనులు నిర్వహించారు. ఇబ్రహీంపల్లి పరిధిలోని కాలనీలతో పాటు ఎమ్మార్వో కార్యాలయం, కోర్టు పరిసరాల్లో కూడా శ్రమదానం కార్యక్రమం నిర్వహించి పరిశుభ్రత చర్యలను విస్తరించారు. ఈ కార్యక్రమం ద్వారా స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యమని అధికారులు వెల్లడించారు.

# ఏప్రిల్, మేలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే మొదటి విడతలో ఇళ్ల మంజూరు జరగగా మిగిలిన మూడు విడతలను కూడా దశలవారీగా పూర్తిచేస్తామని చెప్పారు. మారుమూల గిరిజన తండాలు, గూడాల్లో గతంలో ప్రారంభమై వివిధ స్థాయిలో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తుందన్నారు. వివిధ నిర్మాణ దశల్లో ఉన్న ఇళ్లకు ఫ్లెక్సిబిలిటీ ఇచ్చి లబ్ధిదారులకు అనుకూలంగా మార్పులు చేపడతామపి, .లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి వివక్ష ఉండదని, కులం, మతం, పార్టీతో సంబంధం లేకుండా అత్యంత పేదలకే ప్రాధాన్యం ఇస్తాన్నామని స్పష్టం చేశారు. ఎక్కడైనా లోపాలు ఉన్నట్లు సమాచారం అందితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మార్చి నాటికి సుమారు లక్ష ఇళ్లు పూర్తి కానున్నాయని, జూన్-జూలై నాటికి మొదటి విడతలో మంజూరైన మూడు లక్షల ఇళ్లలో మెజారిటీ పూర్తి అవుతాయని, పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించామని, పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ప్రస్తుతం వాళ్ళు నివసిస్తున్న ప్రాంతానికి వీలైంత దగ్గరలో ఇండ్ల నిర్మాణాలు చేపట్టడానికి కార్యాచరణ రుపొందిస్తున్నామని వివరించారు. గతంలో దూర ప్రాంతాల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులు ఉపయోగించలేకపోయిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. అదేవిధంగా, 2బీహెచ్‌కే పథకంలో పెండింగ్ బిల్లులలో 99% ఇప్పటికే చెల్లించామని, మిగిలినవాటిని కూడా త్వరలో క్లియర్ చేస్తామని చెప్పారు. వివిధ దశల్లో ఆగిపోయిన ఈ ఇళ్లను పూర్తి చేసి అర్హులైన పేదలకు అందజేయడానికి ప్రభుత్వం 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నదన్నారు. వచ్చే రెండు, మూడు నెలల్లో డిజిటల్ మీడియా పాలసీని తీసుకు రాబోతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. జర్నలిస్టుల సమస్యలపై శాసనమండలిలో బుధవారం పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. జర్నలిస్టు మిత్రులకు భద్రత కల్పించే విషయములో ఈ ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ విషయంలో కొంతమంది లేనిపోని అపోహలను సృష్టిస్తున్నారు.. అర్హులైన జర్నలిస్టులందరికీ ఆ కార్డులు జారీ చేస్తాం. ఎలాంటి భ్రేషజాలాలకు పోకుండా మొదట విడుదల చేసిన జీవోపై అన్ని జర్నలిస్టుల సంఘాల అభిప్రాయాలను, సూచనలను తీసుకొని మార్పులుచేర్పులు చేశామన్నారు. డెస్క్ జర్నలిస్టులు, మరో జర్నలిస్టులనే తేడా తమ ప్రభుత్వానికి లేదన్నారు. ఇండ్ల స్థలాల విషయములో కూడా సానుకూల నిర్ణయం తీసుకుంటామని, ఇప్పటికే ఈ విషయములో ముఖ్యమంత్రి స్పష్టత ఇచ్చారని, న్యాయస్థానం పరిధిలో ఇబ్బందులు లేకుండా ఇండ్ల స్థలాలు ఇవ్వడానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు.

# మూసీ ప్రక్షాళన పేరుతో లక్షన్నర కోట్ల దోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

డీపీఆర్ తయారీకి 18 నెలలు పడుతుందని గతంతో ప్రభుత్వం చెప్పిందని గుర్తుచేశారు. 18 నెలలు పడుతుందన్న డీపీఆర్ రెండు నెలల్లో ఎలా వచ్చిందని ప్రశ్నించారు.మూసీ ప్రాజెక్టు మొదటి ఫేజ్ తర్వాత ఎన్ని ఫేజులు ఉంటాయని కేటీఆర్ అడిగారు. మూసీ ప్రాజెక్టుకు ఎన్ని ఫేజులు ఉన్నాయని ప్రశ్నించారు. రూ. 16వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టు లక్షన్నర కోట్లు ఎందుకు అని నిలదీశారు. మూసీ ప్రాజెక్టులో బఫర్ జోన్ ఎంత అని ప్రశ్నించారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుతో వేలాది మంది నష్టపోతున్నారని తెలిపారు. మూసీ ప్రాజెక్టుతో రేవంత్ సర్కార్ గృహ మేధ యాగం చేస్తోందని మండిపడ్డారు. బ్లాక్ లిస్ట్ చేసిన కంపెనీలకు కాంట్రాక్టు ఎందుకిస్తున్నారని ప్రశ్నించారు. డీపీఆర్ లేకుండా హడావిడిగా ఇళ్లు ఎందుకు కూలుస్తున్నారని అడిగారు. కేటీఆర్ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలిన ప్రభుత్వం.. దాటవేసే ధోరణిలో వ్యవహరించింది. దీంతో బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. మూసీపై రేవంత్ సర్కార్ తీరుకు నిరసన తెలిపారు. ముఖ్యంగా డీపీఆర్ తయారీ, ఇళ్ల కూల్చివేతలు, భూసేకరణ, ప్రాజెక్ట్ వ్యయం పెంపు, అలాగే ప్రభుత్వం చేస్తున్న విభిన్న ప్రకటనలలో ఉన్న విరుద్ధతలను ఎత్తిచూపుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, సుధీర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, బండారు లక్ష్మారెడ్డి కలిసి మూసీ ప్రాజెక్టుపై అనేక సందేహాలను వ్యక్తం చేశారు. మొత్తం 16 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును లక్షన్నర కోట్లకు పెంచడం వెనుక ఉద్దేశ్యం ఏమిటో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఒకవైపు లక్షన్నర కోట్లు అంటుండగా, సభలో మాత్రం నాలుగు, ఐదు వేల కోట్లు అని చెప్పడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టును ఎన్ని దశల్లో అమలు చేస్తారు, ఎంత భూసేకరణ జరుగుతుంది, ఎన్ని ఇళ్లు కూల్చివేస్తారు అనే విషయాలను ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గెజిట్ ప్రకారం 10,000 పైగా ఇళ్లు కూల్చివేతకు గురవుతాయని, 3,260 ఎకరాల భూమి సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. బఫర్ జోన్‌ను విస్తరించామని స్థానిక ఆర్డీవో చెబుతున్నారని, అసలు బఫర్ జోన్ ఎంత వరకు పెంచారో, దానికి ప్రమాణాలు ఏమిటో ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు.

**పారదర్శకత లేని నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకిస్తాం**


మూసీ ప్రాజెక్ట్ పేరిట ప్రజల ఆస్తులు, ఇళ్లు, జీవనోపాధిపై దెబ్బతీసే చర్యలను బీఆర్ఎస్ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదని, పారదర్శకత లేకుండా తీసుకునే ప్రతి నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వద్ద డీపీఆర్ ఉందా లేదా అన్న విషయానికే స్పష్టమైన సమాధానం లేదని విమర్శించారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సైతం డీపీఆర్ లేదని చెబుతున్నారని తెలిపారు. ఎన్ని ఇళ్లు కూల్చివేస్తున్నారు అనే విషయానికీ ప్రభుత్వం సరైన వివరాలు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం ఫైవ్ స్టార్ హోటళ్లలో ప్రజెంటేషన్లు చేయకుండా, బాధితులతో ప్రజల మధ్యే ప్రజెంటేషన్ ఇవ్వాలని తాము డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ కారణంగానే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు బీఆర్ఎస్ హాజరుకాలేదని స్పష్టం చేశారు. మూసీ నదిని మురికి కూపంగా మార్చింది కాంగ్రెస్ పార్టీయేనని కేటీఆర్ ఆరోపించారు. ఇప్పుడు అదే పార్టీ ప్రజల పేరుతో భారీ ప్రాజెక్ట్ పేరుతో అవినీతి చేయాలని చూస్తోందని అన్నారు. ప్రభుత్వం వద్ద డీపీఆర్ ఉంటే వెంటనే సభలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 50 టర్ల బఫర్ జోన్ అని చెప్పి, ఐదు కిలోటర్ల దూరంలో ఉన్న హనుమాన్ నగర్‌కు నోటీసులు ఇవ్వడం ప్రభుత్వ అస్పష్టతకు నిదర్శనమని విమర్శించారు. మొదట 1,400 ఇళ్లు కూల్చివేస్తామని చెప్పి, ప్రస్తుతం 10,000 ఇళ్లకు పైగా నోటీసులు ఇవ్వడం ఎలా జరిగిందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో సొంత జిల్లాలోనే ఇళ్లు కూల్చివేస్తున్నా ఉప ముఖ్యమంత్రికి కనీస సమాచారం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం వద్ద నిధులు లేవని, సరైన ప్రణాళిక లేదని, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ లోన్ కూడా లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్ట్ డీపీఆర్ తయారీని 'మెయిన్ హార్ట్' అనే కంపెనీకి అప్పగించారని, ఈ కంపెనీని సింగపూర్, పాకిస్తాన్, భారతదేశంలోని అనేక సంస్థలు బ్యాన్ చేశాయని తెలిపారు. గతంలో ఇదే అసెంబ్లీలో డీపీఆర్ తయారీకి కనీసం 18 నెలలు పడుతుందని చెప్పి, ఇప్పుడు కేవలం రెండు నెలల్లో డీపీఆర్ సిద్ధమైందని చెబుతుండటం అనుమానాస్పదమని అన్నారు. రెండు నెలల్లో అద్భుతంగా డీపీఆర్ తయారు చేసి ఉంటే, దాన్ని ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్టుకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ రుణం ఇవ్వడానికి అంగీకరించిందని మంత్రి శ్రీధర్ బాబు సభలో చెప్పారని, కానీ బ్యాంక్ అధికారులను సంప్రదించగా జనవరి 23 నాటికి ఎలాంటి డీపీఆర్ తమకు అందలేదని, కాబట్టి రుణంపై ఎలాంటి అంగీకారం లేదని స్పష్టం చేశారని తెలిపారు. మార్చి 11న కూడా అదే విషయాన్ని ఏడీబీ మరోసారి స్పష్టం చేసిందని అన్నారు. ప్రభుత్వం తన సమాచారాన్ని సరిదిద్దుకోవాలి లేదా కావాలనే ప్రజలను, సభను తప్పుదోవ పట్టిస్తున్నదా అనే అనుమానం కలుగుతోందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# మూసీ నిర్వాసితులకు అదే ప్రాంతంలో అపార్టుమెంట్

(మొదటి పేజీ తరువాయి)

గండిపేట నుంచి బాపు సరోవర్ వరకు మొదటి దశలో చేపడుతున్న ఈ పునరుజ్జీవ కార్యక్రమం కేవలం ప్రచార ఆర్భాటం కోసం చేస్తున్నది కాదని, మహాత్మా గాంధీ చెప్పినట్టు ప్రతి నిర్ణయంలోనూ అత్యంత పేదవాడి కన్నీళ్లు తుడవాలనే సంకల్పంతోనే తాము ముందుకు సాగుతున్నామని మంత్రి భట్టి చెప్పారు. మూసీ పరివాహక ప్రాంతంలోని పేద ప్రజలకు అత్యుత్తమమైన హైజీనిక్ వాతావరణాన్ని కల్పించి, వారిని ఈ అభివృద్ధి ప్రక్రియలో భాగస్వాములను చేయడమే తమ లక్ష్యమన్నారు. విపక్షాలు పక్కదోవ పట్టించే ప్రయత్నం చేయకుండా పేదవాడి జీవితాల్లో వెలుగులు నింపే ఈ బృహత్తర కార్యక్రమాన్ని అభినందించాలని కోరుతున్నానన్నారు.బీఆరఎస్ నేతల మాదిరిగా తాము ప్రచార ఆర్భాటం చేయమని, మూసీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు వివరాలన్నీ వెబ్‌సైట్‌లో ఉన్నాయని తెలిపారు. ఎవరైనా సలహాలు సూచనలు ఇవ్వవచ్చు.. మంచి సలహాలు ఉంటే స్వీకరించి ముందుకు వెళతాం అని భట్టి విక్రమార్క చెప్పారు.

## భద్రాద్రిలో నేటి నుంచి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు



భద్రాచలం, మార్చి 18 (పోలీస్ నిఘా) : దక్షిణ అయోధ్య భద్రాచలం పుణ్యక్షేత్రంలో గురువారం నుండి శ్రీరామనవమి తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 2వ తేదీ వరకు కొనసాగే బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 27న సీతారాముల కళ్యాణం, 28 న మహా పట్టాభిషేకం ఘనంగా నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామివారి కళ్యాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు తీసుకురానున్నారు. దూర ప్రాంత భక్తుల కొరకు కళ్యాణం టికెట్స్ ఆన్లైన్ లో అందుబాటులో ఉంచారు. కళ్యాణం వీక్షించడానికి భద్రాద్రి వచ్చిన భక్తులందరికి ప్రసాదం, కళ్యాణ తలంబ్రాలు అందేలా, 2 లక్షల లడ్డు ప్రసాదం, 5 లక్షల తలంబ్రాల ప్యాకెట్స్ సిద్ధం చేస్తున్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని రామాలయం తో పాటు పుణ్యక్షేత్రం లోని కూడళ్లు సర్వాంగ సుందరంగా అలంకరించారు. ప్రధాన రహదారులలో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయడంతో భద్రాద్రిలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

## నేటి నుంచి నల్ల పోచమ్మ దుర్గమ్మ జాతర మహోత్సవాలు



టేక్మాల్, మార్చి 18 (పోలీస్ నిఘా) : మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం టేక్మాల్ మండల పరిధిలోని ఎల్లుపేట గ్రామంలో ప్రతి ఏటా ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే నల్ల పోచమ్మ దుర్గమ్మ గ్రామ దేవతల జాతర మహోత్సవాలను అనవయతిగా నిర్వహిస్తారు. అందులో భాగంగా ఈరోజు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామ దేవతామూర్తుల దేవాలయాల చుట్టూ డప్పు చప్పులతో చిందుల గురువారం నాడు విన్యాసాలతో బండ్లు తిరుగుతాయి. రెండవ రోజు ఉదయం బోనాలు 8.00గంటల నుండి 11:00వరకు మధ్యాహ్నం 12:00గంటలకు నుండి కుస్తీ పోటీలు జరుగుతుంది.కుల మతాలకు అతీతంగా అంగరంగ వైభవంగా మట్టి కుండలతో బోనాలు కుదించి నైవేద్యాన్ని అందులో పెట్టి గ్రామ పురవీధుల గుండా గ్రామదేవతలకు అనంతరం గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకుంటారు. అనంతరం మధ్యాహ్నం కుస్తీ పోటీలు నిర్వహించడం జరుగుతుందని గ్రామ సర్పంచ్ మరియు పాలకవర్గం సభ్యులు తెలిపారు.

## హాస్టల్ విద్యార్థినులపై అసభ్య ప్రవర్తన

### ▸▸నిందితులకు 3 ఏళ్ల జైలు శిక్ష

### ▸▸నిందితులకు చెరో లక్ష రూపాయల చొప్పున మొత్తం రూ.2 లక్షల జరిమానా

### -జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు-



మెదక్, మార్చి 18 (పోలీస్ నిఘా) : మెదక్ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వాచ్‌మెన్ స్వామి, అటెండర్ రాజుకు కోర్టు మూడు సంవత్సరాల జైలు శిక్ష విధించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, తెలిపారు. విద్యార్థినుల భుజాలపై చేతులు వేయడం, వారు బట్టలు మార్చుకునే సమయంలో రహస్యంగా గమనించడం వంటి ఘటనలపై ఆగష్టు 2018 లో ఫిర్యాదు అందినట్లు పేర్కొన్నారు.ఈ ఘటనపై అప్పటి తూప్రాన్ ఎస్ఐ నాగార్జున గౌడ్ కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి ఐఓలు డీఎస్పీ తూప్రాన్ రాంగోపాల్ రావు, కిరణ్ కుమార్‌లు పూర్తి సాక్ష్యాలను సేకరించారు. ప్రస్తుత ఐఓ గంగారాజు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు.పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య సమర్థవంతంగా వాదనలు వినిపించగా, సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావాలి నిందితులకు మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు చెరో లక్ష రూపాయల చొప్పున మొత్తం రూ.2 లక్షల జరిమానా విధించినట్లు ఎస్పీ తెలిపారు.ఈ కేసులో కోర్టు లైజనింగ్ ఆఫీసర్ విఠల్, కానిస్టేబుల్ కృష్ణ, సీడీఓ నాగరాజు, భరోసా లీగల్ అడ్వైజర్ అడ్వకేట్ శ్వేతా తదితరులు సహకరించినట్లు ఎస్పీ వివరించారు.ఈ కేసులో నిందితులకు శిక్ష పడేందుకు కృషి చేసిన పోలీసు సిబ్బందిని మరియు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్యను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## ఆలేరు బజరంగ్ దళ్ నూతన కన్వీనర్‌గా ఎన్నికైన కొమ్ము శ్రావణ్‌కు ఘన సన్మానం



యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు , మార్చి 18 (పోలీస్ నిఘా) : ఆలేరు బజరంగ్ దళ్ నూతన కన్వీనర్ గా ఎన్నికైన కొమ్ము శ్రావణ్ ను శ్రీరామ్ సేన ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆలేరు బజరంగ్ దళ్ కన్వీనర్ శ్రావణ్ మాట్లాడుతూ భారతదేశంలోనే ఒక హిందూ యువజన సంస్థ బజరంగ్ దళ్ అని అన్నారు. యువత హిందూ ధర్మం మరియు సంస్కృతిని రక్షించడం కోసం కదలి రావాలని అన్నారు. బజరంగ్ దళ్ యువతలో దేశభక్తి సాంప్రదాయ విలువలను పెంపొందిస్తుందని అన్నారు. గోవుల రక్షణకై బజరంగ్ దళ్ నిర్విరామంగా పోరాటం చేస్తుందని అన్నారు.ధర్మరక్షణకై హిందూ యువకులంతా ఐక్యమై పోరాటం చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ పాసికంటి సంపత్, శ్రీరామ్ సేన ఆలేరు అధ్యక్షులు మైదంభాస్కర్, ప్రధాన కార్యదర్శి పేరపు ఆనంద్, కోశాధికారి ఆలేటి శ్రీకాంత్, కార్యదర్శి చింతకింది వినయ్, పడకండి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ నిఘా

సంపాదకీయం | గురువారం | 19 మార్చి 2026

## ఉచిత పథకాల భారమా?

అన్ని ఉచితమైనప్పుడు ప్రజలు ఎందుకు పనిచేయాలి? అనే భావన రావడం, ప్రభుత్వాలు ఎక్కువగా అప్పులు చేయడం, ఫలితంగా ప్రజలపై అదనపు పన్నుల భారం మోపడం జరుగుతుంది. ప్రభుత్వాలు కొత్త రోడ్లు, ఆసు పత్రులు, పాఠశాల, క్రొత్త పరిశ్రమలు నెలకొల్పలేకపోవడంతో పాటు, ప్రజలకు కరెంట్, నీరు, నిత్యావసర వస్తువులపై చార్జీలు పెంచడం జరుగుతుంది. ఎన్నాళ్లీ ఉచిత పథకాల అమలు? ఇదేనా మనం చేసే జాతి నిర్మాణం? రాష్ట్ర ప్రభుత్వాలన్నీ దాదాపుగా రెవెన్యూ లోటులోనే ఉన్నా ఈ పథకాల అమలుకు డబ్బు ఎక్కడి నుంచి తెస్తున్నాయి? నెలవారీ ఆదాయంలో ఉద్యోగుల జీతాలు, ఉచిత పథకాల అమలు అన్న రెండు పనులు తప్పితే మూడో పని చేసే స్థితిలో ప్రభుత్వాలు లేవు.. ప్రభుత్వ బాధ్యత ఇంత వరకేనా? ఉద్యోగావకాశాలు కల్పించి ఆత్మగౌరవంతో బతికే పరిస్థితి కల్పించవద్దా? అని ఇటీవల సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు.. ఇక కొందరు వ్యక్తులు అన్నీ ఉండి కూడా తమకున్న పలుకుబడితో ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు, ఉచితాలు మొదట తమ జేబుకే చేరాలంటున్నారు. ఈ ఉచిత పథకాలు సరైన లక్ష్యంతో, ఆర్థిక క్రమశిక్షణతో అమలు చేస్తే ఉపయోగకరంగా ఉంటాయి. కానీ రాజకీయ ప్రయోజనాల కోసం, అవి ఉచితాలు ఇవ్వడం దేశ ఆర్థిక వ్యవస్థకు హానికరం కావచ్చు.. ఎప్పుడూ ప్రభుత్వం డబ్బు ఇస్తే కొంతమంది స్వయం ఉపాధి, వ్యాపారం, పొదుపు వంటి విషయాల్లో ఆసక్తి తగ్గించే ప్రమాదం ఉంటుంది. దీనితో కుటుంబాల ఆర్థిక స్థిరత్వం దెబ్బతినవచ్చు.. ప్రభుత్వ డబ్బు ఎక్కువ భాగం ఉచిత పథకాలకు వెళ్తే కొత్త రోడ్లు, ఆసుపత్రులు, పాఠశాలలు, పరిశ్రమల నిర్మాణానికి నిధులు మిగలకపోవచ్చు.. ప్రభుత్వం ఎక్కువగా అప్పు తీసుకుంటే, ఆ డబ్బు తిరిగి చెల్లించాలి. పన్నులు పెంచడం ద్వారా, చార్జీలు పెంచడం ద్వారా ప్రభుత్వం చెల్లిస్తుంది. ఉచిత విద్యుత్ పథకాల వల్ల విద్యుత్ పంపిణీ సంస్థలు నష్టాల్లోకి వెళ్తాయి. అప్పుడు ప్రభుత్వం ఆ నష్టాలను భరించడానికి మరింత రుణాలు తీసుకోవాల్సి వస్తుంది. భవిష్యత్తులో విద్యుత్ చార్జీలు పెరగవచ్చు లేదా పవర్ కట్లు ఎక్కువ కావచ్చు. 2019–20 నాటికి సుమారు రూ. 1.95 లక్షల కోట్ల నుంచి 2023–24 నాటికి సుమారు రూ. 3.5 – రూ. 3.9 లక్షల కోట్ల వరకు చేరింది. 2024–25 నాటికి రూ. 4.51 లక్షల కోట్ల వరకు చేరింది. ప్రజలు తాము చెల్లిస్తున్న పన్నుల నుంచి మంచి రోడ్లు, మంచి పాఠశాలలు, మంచి ఆసు పత్రులు ఇటువంటి సౌకర్యాలు కోరుకోరా? చాలా చోట్ల ఎన్నికలకు ముందు ప్రజలు అడిగినా, అడగకపోయినా, సాధ్యమైనా కాకపోయినా హామీలు ఇవ్వడం. పూర్తిగా న్యాయం చేయలేకపోవడం చూస్తూనే ఉన్నాం. ప్రభుత్వం ఇప్పటికైనా అన్ని రాజకీయ పార్టీల నాయ కులతో ఆలోచించి పునః సమీక్షించుకోవలసిన అవసరం ఉంది. పిల్లలకు మంచి ప్రభుత్వ పాఠశాలలు, మంచి టీచర్స్‌ని ఇవ్వాలి. ప్రభుత్వాలు ప్రజలకు మంచి ఆసుపత్రులను నెలకొల్పాలి. ప్రభుత్వాలు అప్పులలో ఉన్నాయి. ఇలా విచ్చలవిడి ఉచితాలు పంచుకుంటూ పోవడం పైనే అందరి ఆందోళన. ఏడాదిలో వసూలయ్యే ఆదాయంలో కనీసం 25 శాతాన్ని కేవలం అభివృద్ధి కోసమే ఎందుకు కేటాయించకూడదు ప్రజలకు వోటు వేసేటప్పుడు ఉచితాలపై కాకుండా అభివృద్ధి, ఉద్యోగాలు, విద్య, వైద్యంపై దృష్టి పెట్టాలి.

# ఆధునిక యుద్ధాల్లో డ్రోన్లదే కీలక పాత్ర

యుద్ధ విధానాలు, ఆయుధాలు, వ్యూహాలు నిరంతరం మారుతున్నాయి. ఇటీవలి సంఘర్షణల నుంచి సైన్యాలు అవసరమైన సాంకేతికతలు, లోపాలను అంచనా వేయాలి. భారత ఎయిర్ డిఫెన్స్ సైర్ ద్వారా డ్రోన్ దాడులను ఎదుర్కొనే సన్నద్ధతను పరీక్షించింది.

**అంతర్జాతీయ యుద్ధాల్లో పాఠాలు**

అర్మేనియా–అజర్‌బైజాన్ సంఘర్షణలో తక్కువ ధర డ్రోన్‌లు బలవంతమైన సైన్యాన్ని మించాయి. రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో డ్రోన్ స్వార్మ్‌లు వ్యూహాలను మార్చాయి. ఇజ్రాయెల్–ఇరాన్ (గతేడాది జూన్‌లో 12 రోజులు) ఘర్షణలో స్వీయ రక్షణ వ్యవస్థలు, మార్పులు అమెరికాకు సవాల్‌గా మారాయి. ఈ యుద్ధాలు డ్రోన్ ఆధిపత్యాన్ని చూపాయి.

**థార్ ఎడారిలో ఫైర్ లక్ష్యాలు**

రాజస్థాన్‌లో ఎయిర్ డిఫెన్స్ కమాండ్ పాకిస్తాన్, చైనా, బంగ్లాదేశ్ డ్రోన్ దాడులను అనుకరించింది. పదులు, వందలాది డ్రోన్‌లను గుర్తించి,



ట్రాక్ చేసి తిప్పికొట్టే సామర్థ్యాన్ని పరీక్షించారు. రాడార్లు, సెన్సార్లు, కమాండ్ వ్యవస్థల పనితీరును వాస్తవ పరిస్థితుల్లో సృష్టించి ధ్రువీకరించారు. లైవ్ ఫైరింగ్‌తో సమగ్ర గగన రక్షణ పరీక్షలు పూర్తయ్యాయి.

**ఎస్–400 పరిమితులు**

ఎస్–400 డ్రోన్‌లను ట్రాక్ చేస్తుంది కానీ 10 టార్గెట్లకు మాత్రమే పరిమితం. మిగతా స్వార్మ్‌లను మేనేజ్ చేయడానికి బహుళ లేయర్ డిఫెన్స్‌లు అభివృద్ధి చేశారు. ఇంటిగ్రేటెడ్ సెన్సార్ నెట్‌వర్క్‌లు, ఆటోమేటెడ్ ట్రాకింగ్ వంటివి పరీక్షించారు. ఇది భవిష్యత్ సంఘర్షణల్లో ఆధిక్యత ఇస్తుంది.

**ఆర్థిక అసమతుల్యతలు**

డ్రోన్ తయారీ ఖర్చు రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షలు మాత్రమే, కానీ మిలియన్ డాలర్ల ఆయుధాలతో కూల్చడం ఖర్చును పెంచుతుంది. ఫైర్ చవకైన పరిష్కారాలు (లేజర్ వెపన్స్, ఇలెక్ట్రానిక్ జ్యామింగ్) గుర్తించారు. ఈ అధ్యయనం ఆర్థిక భారాన్ని తగ్గించే వ్యూహాలను రూపొందిస్తుంది. అంతర్జాతీయ పోరాటాల నుంచి పాఠాలు అమలు చేసి భారత సైన్యం సన్నద్ధత పెంచుకుంది. డ్రోన్ యుగంలో గగనతల ఆధిపత్యం కీలకం. ఈ సాధన దక్షిణాసియా సంఘర్షణల్లో భారత ఆధిక్యాన్ని బలపరుస్తుంది.

# నైపుణ్యాలకు పదును.. ఇదే సరైన అదను


పదిమాసాల పాఠశాల లేదా కళాశాల విద్యా సంవత్సరం పూర్తి కావడం, ఆ తర్వాత పరీక్షలు కూడా పూర్తి అయిన తర్వాత మానసిక ఉల్లాసానికి ఆతిథ్యం ఇచ్చే వేసవి సెలవుల రాకకోసం విద్యార్థిలోకం ఎంతగానో ఎదురుచూడడం జరుగుతుంది. ఏడాదిలో ఒక్కసారి లభించే రెండు మాసాల వేసవి సెలవులు యువతకు ఎన్నో రకాల అనుభవాలను మూటకట్టి పెడతాయి. ఊపిరాడనంతగా ఒకే రకమైన యాంత్రిక జీవనశైలి గడిపిన విద్యార్థులు విద్యాలయ దినచర్యకు దూరం జరిగి వేసవి సెలవుల్లో కొన్ని వారాలపాటు విశ్రాంతి, వినోద విరామాలను పొందుతూనే తమకు నచ్చిన పసందైన కార్యక్రమాలకు ప్రాణం పోసేందుకు యువత ఉవ్విళ్లూరుతూ ఉంటారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులతో స్వేచ్ఛగా, సరదాగా గడపడానికి వేదికలుగా వేసవి సెలవులు ఉపయోగపడతాయి. హోమం వర్క్, పరీక్షలు, తీరిక ఇవ్వని అకడమిక్ కార్యక్రమాలు, నోట్స్ రాయడం, బడి గంటలకు దూరంగా తమకు నచ్చిన రీతిలో వేసవి సెలవులు గడపడానికి పిల్లలు పథకాలు వేస్తూ ఉంటారు. మానసిక ఒత్తిడి నుంచి బయటపడి తమ అభిరుచులు, ఆసక్తి కలిగిన పనులు, ఆటపాటలు, ఆన్‌లైన్‌లో మునకలు, సినిమాలు, పర్యాటక ప్రయాణాలు, క్రీడా ప్రాంగణాలకు పరుగులు, అమ్మ చేతి వంట రుచులు, దర్శనీయ స్థలాల పయనాలు, వినోద విజ్ఞాన వేదికలు, ఆరోగ్యం కాపాడుకునే కార్యాలు, మానసిక ఉల్లాస విందులు, సృజన/ విలక్షణ



ఆలోచనలు, తమకునచ్చిన ఫైన్ ఆర్ట్‌లో శిక్షణల కోరికలు లాంటి అనేక ప్రణాళికలను నిజం చేసుకునే సమయంగా వేసవి సెలవులు ఉపకరిస్తాయి. అవసరం మేరకు నిద్రపోవడం, మెదడు చురుదనం పెంచడానికి కార్యక్రమాలు, మనసుకు నచ్చిన కార్యక్రమాలు చేస్తూ మానసిక ఒత్తిడిని తగ్గించే అంశాలకు సమయం ఇవ్వడం వేసవి సెలవుల్లో మాత్రమే జరుగుతుంది. తమకు నచ్చిన అంశాలకు చెందిన పుస్తకాలు చదవడం, విజ్ఞాన వినోదాత్మక సినిమాలు చూడడం, సుస్వర సంగీతం వినడం, ఆటపాటల్లో మునిగితేలడం, కుటుంబ సభ్యులు లేదా మిత్రులతో కలిసి బయటకు వెళ్లడం లాంటివి మానసిక వికాసానికి, మనసును తేలిక పర్చుకోవడానికి ఉపకరిస్తాయి. మన ప్రేమను చూరగొన్న సమీప బంధువులు లేదా మిత్రుల వద్దకు వెళ్లడం, పిక్నిక్/జూ/సర్కస్/ఎగ్జిబిషన్‌లకు వెళ్లడం, మనకు నచ్చిన క్రీడలు లేదా కళల్లో శిక్షణ తీసుకోవడం, వ్యక్తిత్వ వికాస ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ తరగతులకు హాజరు కావడం లాంటివి మంచి నిర్ణయాలు అవుతాయి.

నేటి ఆధునిక డిజిటల్ యుగం లో పుట్టుకొస్తున్న శాస్త్రసాంకేతిక ప్రగతి ఫలాలను ఆస్వాదించడం, దినపత్రికలను చదవడం, పాఠ్యాంశాలకు సంబంధించిన అదనపు పరిజ్ఞానాలను పొందడం, మానసిక పరిపక్వతకు ఆజ్యం పోసే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు హాజరుకావడం లాంటివి పిల్లలకు అందుబాటులో ఉంచాలి. నైపుణ్యాలు, విజ్ఞానం, సామర్థ్యాలకు పదును పెట్టడం లాంటివి మరువరాదు. సృజనశీల అంశాల్లో అడుగు పెట్టడంతో పాటు ఇన్నొవేటివ్ ఆలోచనలు చేయడం మన పిల్లల శారీరక మానసిక భావోద్వేగ వికాసానికి దోహదపడతాయి. నేటి ఆరోగ్యమే రేపటి భవితకు పెట్టుబడి అని, ఆరోగ్యమే మహాభాగ్యం అని నమ్ముతూ వేసవి సెలవుల్లో ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలి. తగినంత సమయం నిద్ర పోవడం, సమయానికి ఆహారం తీసుకోవడం, పరిమిత సమయం పాటు ఆటపాటలకు కేటాయించడం, ప్రతి రోజు కొంత సమయం వ్యాయామం/యోగా/ప్రాణాయామం/వాకింగ్/స్విమ్మింగ్/ట్రెక్కింగ్/మౌంటెనీరింగ్ చేయడం, సూర్యోదయాన్ని చూసి ఆనందించడం మరువరాదు. వీటికితోడుగా తోట పనుల్లో నిమగ్నం కావడం, పర్యావరణ పరిరక్షణ సేవలు, నిస్వార్థ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, దేవాలయాలు లేదా ప్రార్థనా స్థలాలను సందర్శించడం లాంటివి చేయడం ఉత్తమం అని భావించాలి. పిల్లలు వేసవి సెలవులను సమర్థవంతంగా, ప్రయోజనాత్మకంగా గడపడంలో తల్లిదండ్రుల పాత్ర అధికమని గమనించాలి. వేసవి సెలవుల రూపంలో లభించిన రెండు మాసాల్లో పిల్లల దురలవాట్లు లేదా అనారోగ్యకర దినచర్యలకు అలవాటు పడకుండా చూసుకోవడం పెద్దల కనీస కర్తవ్యం అని తెలుసుకోవాలి. అధిక కాలం పాటు స్మార్ట్‌ఫోన్ వాడడ్ం లేదా టీవీ ముందు కూర్చోవడం మంచి అలవాటు కాదని వారించడం మరువరాదు. కరోనా లాక్‌డౌన్ వల్ల పిల్లలు స్మార్ట్‌ఫోన్ బానిసలుగా మారడం చూసాం. ఆన్‌లైన్ గేమ్స్‌కు బదులుగా అవుట్/ఇండోర్ డోర్ గేమ్స్ ఆడడం ఉత్తమమని నమ్మాలి. వేసవి ఎండలను గమనిస్తూ, గంటల తరబడి మైదానాల్లో ఆడకుండా, వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అతి నిద్ర లేదా అతిగా తినడం లేదా అతి గారాబానికి ఆస్కారం ఇవ్వకండి. డ్యాన్స్, ఫైన్ ఆర్ట్, స్విమ్మింగ్, సైక్లింగ్, మ్యూజిక్, ఆటలు లాంటివి నేర్పించండి. వేసవి సెలవులు పూర్తి స్వేచ్ఛకు నెలవులు కావని, వినోదంతో పాటు విజ్ఞానం, ఆటపాటలతో పాటు శారీరక మానసిక వికాసం, ఆన్‌లైన్‌లో సంచరిస్తూ దురలవాట్ల కోరల్లో పడకుండా రేపటి బాధ్యత కలిగిన పౌరులుగా మారడానికి నేటి పిల్లలకు వేసవి సెలవులు ఉపయుక్తం కావాలని కోరుకుందాం. పిల్లల అభిరుచులను గమనిస్తూ వేసవి సెలవుల్లో వారి వ్యక్తిత్వ వికాసం జరిగే విధంగా, విజ్ఞానవంతులుగా మారడానికి తల్లిదండ్రులు పటిష్ట ప్రణాళికలు వేసి వాటిని పక్కాగా అమలు చేయాలి. వేసవి సెలవులను వృథం చేయవద్దు. సెలవుల కాలం సకల నైపుణ్యాలను వర్ధించే నెలవుగా మారాలని కోరుకుందాం.

# సృష్టికి జన్మదినం ఉగాది



భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా ఉంటాయి పండుగలు. వాటిలో ఆనందోత్సాహాలతో జాతి కుల మత భేదాలు లేకుండా వయస్సుతో సంబంధం లేకుండా చిన్నాపెద్దా తేడా లేకుండా తెలుగు వారు అంతా కలిసి జరుపుకునే పండుగ ఉగాది. తెలుగు వారితో పాటు కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల ప్రజలకు కూడా ఉగాది ఇప్పుడే.

చిత్రవర్ణాల చైత్రం రాకతో ప్రకృతి అరుణిమతో కొత్త కాంతులీనుతుంది. చెట్లు చిగురిస్తాయి. కోయిలలు కుహూ రాగాలు తీస్తాయి. మామిళ్ళు పూతపూస్తాయి. భాస్కరుడు కొత్త శోభతో పుడమిని సుసంపన్నం చేస్తాడు. వేదంలో కాల నిర్ణయాత్మక మంత్రాల వల్ల సృష్ట్యాదిని అంటే ప్రళయం తర్వాత మొదలయ్యే కాలాన్ని బ్రహ్మ కల్పం అంటారు. దీనినే కల్ప ప్రారంభం అనీ, కల్పాది అనీ కూడా అంటారు. యుగానికి ప్రారంభం కాబట్టి యుగాది. తెలుగులో ఇది కాల క్రమేణా "ఉగాది"గా స్థిరపడింది. ఉగాది అంటే బ్రహ్మ తన సృష్టిని ప్రారంభించిన దినం. యుగం అంటే రెండు అనే అర్థం కూడా ఉంది. సంవత్సరంలో ఉత్తరాయణం, దక్షిణాయనం అని రెండు భాగాలున్నాయి. ఉత్తరాయణంలోని చైత్ర మాస ప్రతిపత్తే ఉగాది. దీనిని వసంతం అనీ, ఆమని అనీ కూడా అంటారు. ఉగాది రోజునుంచి ప్రారంభమయ్యే నవరాత్రులను వసంత రాత్రులు అంటారు. సృష్ట్యాది ప్రభవించే సంవత్సరాన్ని ప్రభవ అంటారు. ప్రభవ నుంచి అరవై సంవత్సరాలు అరవై పేర్లతో కొనసాగి అక్షయ పేరుతో ముగుస్తాయి. మార్చి 19న ప్రారంభమయ్యే ఈ ఏడాదిని పరాభవ నామ సంవత్సరం అని పిలుస్తాం. దక్షిణ భారతీయులది శాలివాహన శకం. తెలుగు వారు అనుసరించేది చాంద్రమానం. ఆయనాలలో మొదటిది ఉత్తరాయణం. ఋతువుల్లో మొదటిది వసంత ఋతువు. మాసాలలో మొదటిది చైత్రమాసం. పక్షాలలో మొదటిది శుక్ల పక్షం. తిథులలో మొదటిది పాడ్యమి. నక్షత్రాలలో మొదటిది అశ్వని. ఇవన్నీ ఉన్న రోజు నూతన సంవత్సరం ప్రారంభమౌతుంది. అంటే అశ్వనీ నక్షత్రయుక్త చైత్ర శుద్ధ పాడ్యమినాడు ఉగాది పండుగ జరుపుకుంటాం.

ప్రకృతి కన్య శిశిరంలో ఆభరణాలన్నీ ఒలిచి అభ్యంగన స్నానానికి సిద్ధమైన పడతిలా ఉంటుంది. వసంతం వచ్చేనాటికి ఆకుపచ్చని చీర కట్టి రంగు రంగుల పూలు ముడిచి కళకళలాడుతూ వసంతుని కోసం మల్లెపూలతో ఎదురుచూస్తుంది. ఈ మధుమాసంలో శుకాలు, శారికలు, కైవారాలు పలుకుతుంటే, కోయిలలు పంచమస్వరంతో మధురగానం చేస్తుంటే, మందానిలుడు మందహాసంతో తోడ్కొని వస్తుంటే, చైత్ర రథంపై వసంతుడు విచ్చేస్తాడు. రాజుల కాలంలో రతీ మన్మథులను, లక్ష్మీనారాయణులను, శివపార్వతులను పూజించి వసంతాలు చల్లుకునేవాళ్ళు. ఉగాది నుంచి ప్రారంభమయ్యే వసంత నవరాత్రులకు పందిళ్ళు వేసి శ్రీరామనవమి వచ్చేవరకు వాటిని ఉంచి, సీతారాముల కళ్యాణంతో పూర్తిచేస్తారు. ఉగాది రోజున తెల్లవారుజామునే లేచి అభ్యంగన (తలంటు) స్నానంచేయాలి. నువ్వుల నూనెతో తలంటుకొని, ఒడలు రుద్దుకుని, కుంకుడు రసంతో తలరుద్దుకుని, కొత్తబట్టలు వేసుకోవాలి.

వేపపువ్వు, వగరుగా ఉండే మామిడి పిందెలు, చెరకు ముక్కలు, కొత్త చింత, పచ్చిమిరప, ఉప్పు కలిపిన ఉగాది పచ్చడిని తిన్న తర్వాతనే అల్పాహారం భుజించాలి. ఉగాది పచ్చడిలో అరటిపళ్ళ ముక్కలు, ద్రాక్షపళ్ళు కూడా కలుపుకోవచ్చు. తీపి, చేదు, వగరు, పులుపు, ఉప్పు, కారం అనే ఆరు రుచులు ఈ పచ్చడిలో ఉంటాయి కనుక ఇది షడ్రుచుల సమ్మేళనం. రుచులన్నీ సమపాళ్ళలో ఉండేట్లు సరిగ్గా చేస్తే ఈ పచ్చడి రుచిగానే ఉంటుంది. ఉగాది పచ్చడి తినడం వలన వాత పిత్త శ్లేష్మాల వల్ల కలిగే దోషాలు నశించిపోతాయి. పుస్తకాల్లో ఉండే జోక్స్ సరదాకోసం రాసుకునేవే. సంవత్సరంలో వచ్చే కష్టసుఖాలనూ, కోపతాపాలనూ, మిగతా అన్ని అనుభవాలనూ సంయమనంతో స్వీకరిస్తామని ఎవరికి వారు నిర్ణయం తీసుకోవడమే ఉగాది పచ్చడి తినడంలోని అంతరార్థం. పంచ పల్లవాలు, చందన ద్రవం, పూలు, అక్షతలు ఆవాహన చేసి, ఒక పళ్ళెంలో బియ్యంపోసి ముందు



– జి. విజయలక్ష్మి,
ఎం.ఏ.,ఎం.ఫిల్
రచయిత్రి, జర్నలిస్టు

చెప్పిన ద్రవ్యాలు కలశంలో ఉంచి, దానికి కొత్త బట్ట చుట్టి, పైన కొబ్బరికాయ పెట్టి, పసుపు దారంతో కట్టి చుట్టూ పసుపు, కుంకుమలతో బొట్లు పెట్టాలి. దీనిని పురోహితునికి దక్షిణ తాంబూలాలతో సమర్పించాలి. దీనిని ధర్మకుంభం అంటారు. ఈ దానం వల్ల తీరని కోరికలు తీరుతాయని నమ్మకం. పంచాంగశ్రవణం ఉగాదినాడు జరిగే ముఖ్యమైన కార్యక్రమం. తిథి, వార, నక్షత్ర, కరణ, యోగాలే పంచాంగాలు. పంచాంగం వీటి గురించి వివరిస్తుంది. ఈ సంవత్సరం గ్రహస్థితులను, వాటిని బట్టి కలగబోయే పరిస్థితులను పండితులు వివరిస్తారు. ఈ సంవత్సరంలో తమ ఆదాయ వ్యయాలు, రాశిఫలాలు, రాజ్యపూజ్యత, అవమానాలు, ఆరోగ్య విషయాలు, గ్రహణాల సమాచారం, శుభముహూర్తాలు పెట్టుకోదగ్గ రోజులు, మూఢాలు, కార్తెలు మొదలైన విషయాలను పండితులు వినిపిస్తారు. పూర్వం పంచాంగాలు అచ్చు వేసే పరిస్థితి లేకపోవడం వల్ల పంచాంగకర్తలు లేదా పండితుల మీద ఆధారపడి వారితో చెప్పించుకుని వారిని సత్కరించేవారు. ఇప్పుడు చాలా కొద్దిచోట్ల మాత్రమే ఈ విధమైన ఆచారం కొనసాగుతోంది. చాలామంది టీవీల ముందు కూర్చొని పంచాంగ శ్రవణం చేస్తున్నారు. పంచాంగ శ్రవణం అంటే తిథివల్ల సంపద, వారంవల్ల ఆయుష్షు, నక్షత్రంవల్ల పాప పరిహారం, యోగం వల్ల వ్యాధినివారణ, కరణం వల్ల కార్యానుకూలతలు కలుగుతాయి. ఇలా పంచాంగ శ్రవణం చేసేవారు అన్ని దోషాలు తొలగి ఆయురారోగ్య ఐశ్వర్యాలతో ఓలలాడుతారు. ఒక్క వాక్యంలో చెప్పాలంటే మంగళకరమైనది, శత్రునాశనం చేసేది, చెడు కలల దోషాన్ని పోగొట్టేది, గోదానంతో సమానమైనది, ఆయుర్దాయం పెంచేది, శుభాన్ని కలిగించేది, సంతానాన్ని సంపదలను ప్రసాదించేది, ఏకార్యం ఎప్పుడు చేయవచ్చో తెలిపేదే పంచాంగ



శ్రవణం. సాధారణంగా పల్లెటూళ్ళలో ఉగాదికి ముందు రోజు అంటే పాడ్యమికి ముందు అమావాస్య దినాన్నే పంచాంగ శ్రవణం చేస్తుంటారు. సంవత్సరంలో వచ్చే చివరి అమావాస్య అయినా దీన్ని కొత్త అమావాస్య అంటారు. ఉత్తరాదిన మాసం పున్నమితో ముగియడం వల్ల ఇలా ఏర్పడింది కావచ్చు. ఈ అమావాస్య తెల్లవారు జామునే రైతులు 'ఏరోమూర్తం' పెడతారు. కొత్తగా నాగళ్ళు చేయించుకుని, దుక్కి ప్రారంభిస్తారు. చైత్రమాసం నుంచి రాను రాను ఎండలు పెరుగుతాయి. కనుక చలివేంద్రాలు పెట్టడం ప్రారంభమవుతుంది. ఉగాదికి, శ్రీరామనవమికి విసనకర్రలు, గొడుగులు, చెప్పులు దానంచేసే అలవాటు ఉంది. ఉగాది అంటే సృష్టికి జన్మదినం. ఈ సంవత్సరానికి జన్మదినం. మనం మన పుట్టినరోజులు కూడా తెలుగు మాస తిథుల ప్రకారం చేసుకుంటే బాగుంటుంది. పండుగలు చేసుకోవడం, సంప్రదాయాలను పాటించడం వల్ల మనకు మన మాతృభూమి మీద అభిమానం పెరుగుతుంది. నూతన సంవత్సరంనాడు ఒకరి కొకరు తెలుగులోనే "నూతన సంవత్సర శుభాకాంక్షలు" అని చెప్పుకుంటే బాగుంటుంది. ఉగాదికి గుర్తుకు వచ్చే మరో ముఖ్యమైన అంశం కవిసమ్మేళనం. ఉగాది పర్వదినాన కవికోకిలలు తమ గళాలను విప్పి, కవితా ఝురిని వినిపించి జనావళిని పులకింపచేస్తాయి. పండుగలకు ఆది ఇది, అందుకే ఇది ఉగాది!

## ఉగాది పంచాంగ శ్రవణ విశిష్టత



ఉగాది అంటేనే వేప పువ్వు పచ్చడి, పంచాంగ శ్రవణం గుర్తుకొస్తాయి. తెలుగు వారి కొత్త సంవత్సరం ప్రారంభం అయిన మొదటి రోజున అంటే చైత్ర శుద్ధ పాడ్యమి రోజున ఉగాదిగా జరుపుకుంటారు. ఈ ఏడాది ఉగాది పర్వదినం మార్చి 19వ తేదీన వచ్చింది. విశ్వావసు నామ సంవత్సరానికి ముగింపు పలికి 'శ్రీ పరాభవ' నామ సంవత్సరానికి స్వాగతం పలకనున్న నేపథ్యంలో ఉగాది విశిష్టత, చరిత్ర గురించి ఇప్పుడు తెలుసుకుందాం. ఉగాది రోజున పంచాంగం వినడం ఆనవాయితీ. ప్రతి ఒక్కరూ తమ ఆదాయ, వ్యయాల గురించి మంచి చెడుల గురించి తెలుసుకోవాలని భావిస్తారు. అయితే ఉగాది రోజున పంచాంగ శ్రవణం చేయడానికి చేయడానికి కొన్ని నియమాలున్నాయి. అవి ఏమిటంటే.. ఉగాది రోజున పంచాంగ శ్రవణం చేసే సమయంలో ఆలయంలో లేదా ఎక్కడైనా సరే ఉత్తరాభిముఖంగా కూర్చుని పంచాంగం వినడం శుభమని పండితులు చెప్పారు. కొత్త ఏడాది ప్రారంభం రోజునే తమ రాశి ఫలాలు, స్థితిగతులను గురించి తెలుసుకుని అందుకు తగిన విధంగా శాంతులను చేసుకోవడం కోసం పంచాంగ శ్రవణం చేసి చెబుతారు. పంచాంగ శ్రవణంలో తిథి, వార, నక్షత్ర, యోగ, కరణ ఫలితాన్ని తెలుసుకోవడం ద్వారా గంగా స్నానం చేసినంత పుణ్యాన్ని పొందుతారని పెద్దలంటారు.

**పంచాంగ శ్రవణంలో తెలుసుకునే విషయాలు**

పంచాంగ శ్రవణంలో ప్రధానంగా ఆ సంవత్సర ఫలితాలను వివరిస్తారు. గత కొంత కాలం వరకూ రైతులు తాము పండించే పంటలు ఎలా ఉండనున్నాయి? ఏరువాక ఎలా సాగాలి, వర్షాలు ఎలా కురుస్తాయి వంటి అనేక విషయాలు తెలుసుకునే వారు. అంతేకాదు శుభకార్యాలకు ముహర్తం పెట్టడం కోసం, పూజాది కార్యక్రమాల వంటి అనేక విషయాలను తెలుసుకోవడానికి పంచాంగాన్ని ఉపయోగిస్తారు. ఈ పంచాంగం ఉగాది రోజు నుంచి అమల్లోకి వచ్చి.. మళ్ళీ కొత్త సంవత్సరం ము ందు రోజు వరకూ అమల్లో ఉంటుంది. తెలుగు సంవత్స రంలో ఏ ఏ గ్రహాలకు ఏ ఏ అధికారం లభిస్తుందో తెలుసుకు ంటారు. ఆ గ్రహాలే ఆ సంవత్సర నవ నాయకులు. వీరికి లభించే అధికారాన్ని బట్టి ఆ సంవత్సర ఫలితాలు ఉంటాయి.

**పంచాంగం అంటే ఏమిటంటే..**

తిథి, వారం, నక్షత్రం, యోగం, కారణం అనే ఐదు అంగములు కలది కనుక 'పంచాంగం' అంటారు. మానవుల జీవితాల కాలంపైన, కాలం గ్రహాల సంచారంపైన ఆధారపడి ఉంటుంది. గ్రహాల సంచారంపై జ్యోతిష శాస్త్రం ఆధారపడి ఉంది. మనిషి జన్మించింది మొదలు మరణించే వరకూ గ్రహ సంచారం మీద ఆధారపడి ఉంటుంది. మనిషి జన్మించిన సమయం తిథి, వారం, నక్షత్రం బట్టి జాతక రచన జరుగుతుంది. వీటికి పంచాంగమే ప్రమాణము. ఉగాది రోజున సాయంత్రం దేవాలయాల్లో లేదా సత్సంగాలలో పంచాంగ శ్రవణం చేయడం తప్పనిసరి అని నమ్మకం. జ్యోతిష శాస్త్రం చెప్పే ఫలితాలను తెలుసుకుంటారు. కొత్త ఏడాదిలో తాము తీసుకోవాల్సిన లేదా చేయాల్సిన పనుల గురించి తగినట్లు ప్రణాళికలను రెడీ చేసుకుంటారు.

## వసంత ఋతువు రాక ప్రకృతి పులకింత



దేవరకొండ , మార్చి 18 (పోలీస్ నిఘా) : నూతన తెలుగు సంవత్సరం ఆరంభం వసంత ఋతువు ప్రారంభం సందర్భంగా ప్రకృతి ఒడిలో చెట్లు కొత్త చిగుర్లు వేసి,పూత పూసి, కాయలు కాసి ప్రకృతికే అందాన్ని అందజేస్తాయి. ఈ మార్పును మానవ మాత్రులు స్వంతగా ఏర్పాటు చేయలేరు. అది ప్రకృతికి మాత్రమే సాధ్యమౌతుందని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి అంకం చంద్రమౌళి అన్నారు. ఏఐ కనిపెట్టిన మానవుడు చలి కాలంలో చెట్లను పూత పయించలేడు. చైత్రమాసం ఉగాది పండుగ మామిడి కాయలు, వేపపూత, కొత్త చింతపండు ఉగాది పచ్చడి వాతావరణం మార్పుకు మానవులకు మందు లాంటిది అన్నారు. వారు తన ఇంటిచుట్టూ ఎన్నో రకాల చెట్లు నాటి వాటిని సంరక్షణ చేస్తూ ఆనందం పొందుచున్నారు. వారి ఇంటి వాతావరణం చుస్తే మనముకూడా ఇలా చెట్లు పెంచాలని కోరిక కలుగుతుంది. వృక్షో రక్షితి, రక్షితం అనే నానుడి అమలు చేస్తున్నారు.

## డిపిఆర్‌వోకు పోలీసు నిఘా డైరీ అందజేసిన యాదగిరిగుట్ట మండల విలేకరి



యాదగిరిగుట్ట, , మార్చి 18 (పోలీస్ నిఘా) : యాదగిరిగుట్ట మండల విలేకరి ఏ.లత ,నర్సింహా బుధవారం జిల్లా ప్రజా సంబంధాల అధికారి (డిపిఆర్‌వో) అరుంధతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీసు నిఘా డైరీని ఆమెకు అందజేశారు.ప్రాంతీయ సమస్యలు, ప్రజా అంశాలు, ప్రభుత్వ కార్యక్రమాలపై సమాచార ప్రసారం మరింత సమర్థవంతంగా జరగాలనే ఉద్దేశంతో ఈ సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా విలేకరి మాట్లాడుతూ ప్రజలకు నిజమైన సమాచారాన్ని చేరవేయడంలో మీడియా, ప్రజా సంబంధాల శాఖల మధ్య సమన్వయం అత్యంత అవసరమని తెలిపారు.డిపిఆర్‌వో అరుంధతి మాట్లాడుతూ, ప్రజలకు సమయానుకూలంగా సమాచారాన్ని అందించడంలో విలేకరుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరేలా కలిసి పనిచేయాలని సూచించారు.

## కార్మిక నాయకుడు బిక్షపతి పటేల్ ఆధ్వర్యంలో ఘనంగా ఇఫ్తార్ విందు



పటాన్ చెరు, మార్చి 18 (పోలీస్ నిఘా) : సంగారెడ్డి జిల్లా,పఠాన్ చేరు డివిజన్ పరిధిలో శాంతినగర్ కాలనీ లో బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు మరియు కార్మిక నాయకుడు నర్రా బిక్షపతి పటేల్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఘనంగా ఇఫ్తార్ విందు ను ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పఠాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విచ్చేసి ముస్లిం పెద్దలతో ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు, అనంతరం ఇరువురు మాట్లాడుతూ ముస్లిం కుటుంబ సభ్యులకు ముందస్తుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు, రంజాన్ పవిత్ర నెల మాసంలో ముస్లిం సోదరులు వారి కుటుంబ సభ్యులతో కలసి నెల రోజులు ఉపవాసాలు ఉంటూ భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహిస్తారు, కార్మిక నాయకుడు నర్రా బిక్షపతి పటేల్ తన వంతు సహాయంగా తన నివాసం లో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ను ఏర్పాటు చేసారు, పఠాన్ చేరు నియోజకవర్గం లో 28 రాష్ట్రాల ప్రజలు ఉన్నారు, ప్రతి పండుగను కులాలకు అతీతంగా సోదర భావంతో అందరం కలిసి పండుగలను జరుపుకుంటాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు లియాకత్ అలీ, బాబా సెట్, అఫ్జల్, మాజీ ఎంపీపీ మాగ్దుమ్, మైనారిటీ అధ్యక్షుడు అజ్మత్, లడ్డు, వాజిత్ అలీ, కొల్కూరి రామచందర్ రెడ్డి, బాయికడి విజయ్, మిద్దెల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కృష్ణవేణి హై స్కూల్‌లో ముందస్తు ఉగాది వేడుకలు



మంచిర్యాల, మార్చి 18 (పోలీస్ నిఘా) : మంచిర్యాల నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ కృష్ణవేణి హై స్కూల్‌లో ఉగాది పండుగను ముందస్తుగా మార్చి 18న ఘనంగా, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమం గణేశ్ మరియు లక్ష్మీ దేవి పూజలతో ప్రారంభమైంది. పూజలో భాగంగా బక్షాలు మరియు ఉగాది పచ్చడి నైవేద్యంగా సమర్పించారు. ఈ పూజ కార్యక్రమం పండుగకు ఆధ్యాత్మిక వాతావరణాన్ని తీసుకువచ్చింది. తదుపరి, పాఠశాల ప్రిన్సిపాల్ దేవన్న ఉగాది పండుగ యొక్క ప్రాముఖ్యతను వివరించి, కొత్త ఆరంభాలు, సంతోషం మరియు సమృద్ధి సందేశాన్ని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ఆకర్షణగా తెలుగు ఉపాధ్యాయురాలు సుజాత నిర్వహించిన ఉగాది థీమ్ ప్రత్యక్ష ప్రదర్శన నిలిచింది. పూలు, కుండలు మరియు ప్లకార్డులతో అలంకరించిన ఈ ప్రదర్శన ద్వారా ఉగాది పండుగ యొక్క విశిష్టతను వివరించారు. అలాగే ఉగాది పచ్చడిలో ఉండే ఆరు రుచులు (షడ్రుచులు) ‘ తీపి, కారం, చేదు, ఉప్పు, వగరు, పులుపు ’ జీవితం లోని విభిన్న అనుభవాలను సూచిస్తాయని వివరించారు. తదనంతరం విద్యార్థులు సంప్రదాయ వేషధారణలో ఉగాది పాటలకు అనుగుణంగా కోలాటం నృత్యాలు ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థుల కేరింతలు, ఉత్సాహం కార్యక్రమానికి మరింత వర్ణం చేకూర్చాయి. మొత్తంగా ఈ వేడుకలు ఆనందోత్సాహాల నడుమ విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సంస్కృతి పట్ల అవగాహనను పెంపొందించడంలో కీలక పాత్ర పోషించింది.

# భరోసా సెంటర్‌కు 200 మెడికల్ కిట్లు అందజేసిన ప్లాన్ ఇండియా ఎన్‌జీఓ

### భరోసా సెంటర్ బాధితులకు అండగా నిలుస్తుంది: అదనపు ఎస్పీ మహేందర్




మెదక్, మార్చి 18 (పోలీస్ నిఘా) : లైంగిక వేధింపుల బాధితులకు భరోసా సెంటర్ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ తెలిపారు. ఈ రోజు జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్‌ను ఆయన సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులు, సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలించారు. పోక్సో కేసులు, లైంగిక వేధింపుల బాధితుల రక్షణకు తీసుకుంటున్న చర్యలపై సమగ్ర వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు అందిస్తున్న వైద్య సేవలు, మానసిక కౌన్సిలింగ్, న్యాయ సహాయం, అవగాహన కార్యక్రమాల నిర్వహణ తీరును సమీక్షించారు. లైంగిక వేధింపుల బాధితుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, వారికి భయాందోళన కలగకుండా ధైర్యం కల్పించాలని సిబ్బందికి సూచించారు. బాధితులకు తక్షణమే న్యాయ, వైద్య సహాయం అందించడంతో పాటు మానసిక బలం చేకూర్చాలని ఆదేశించారు. మహిళలు, పిల్లలకు ఒకే చోట న్యాయపరమైన, వైద్యపరమైన సేవలు, సామాజిక భద్రత అందించాలనే లక్ష్యంతో భరోసా సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లైంగిక వేధింపులకు గురైన వారు భయపడకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని పిలుపునిచ్చారు. మహిళలు, బాలల రక్షణకు సంబంధించిన చట్టాలు కఠినంగా ఉన్నాయని, నేరాలకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా, పోక్సో మరియు అత్యాచార బాధితుల వైద్య పరీక్షల కోసం ప్లాన్ ఇండియా ఎన్‌జీఓ ఈ రోజు 200 మెడికల్ కిట్లను భరోసా సెంటర్‌లో అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ సమక్షంలో అందజేసింది. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ, బాధితుల వైద్య పరీక్షల్లో మెడికల్ కిట్ల ప్రాముఖ్యతను వివరించారు. అధికారులు మాట్లాడుతూ, ఈ కిట్లు వైద్య పరీక్షలను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. ఈ కిట్లను అందజేసిన ప్లాన్ ఇండియా ఎన్‌జీఓకు భరోసా సెంటర్ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భరోసా కోఆర్డినేటర్ సౌమ్య, భరోసా సిబ్బంది, ప్లాన్ ఇండియా ప్రోగ్రామ్ ఆఫీసర్ వెంకటేష్, సామాజిక కార్యకర్తలు భార్గవి, రవి పాల్గొన్నారు.

# యాసంగి ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు ఉండొద్దు

### యాసంగి వరి ధాన్యం కొనుగోలుపై వివిధ శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేసిన హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హనుమకొండ , మార్చి 18 (పోలీస్ నిఘా) : యాసంగి వరి ధాన్యం సేకరణలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులు ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో యాసంగి వరి ధాన్యం సేకరణ పై వ్యవసాయ శాఖ. సివిల్ సప్లై మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ రైతులు యాసంగి వరి ధాన్యాన్ని విక్రయించే నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో దాన్యము డబ్బులను చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలులో గన్నీ సంచులు కొరత లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గ్రామ సమాఖ్య సంఘాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని నేరుగా మిల్లర్ల వద్దకు గాని ఎఫ్ సి ఐ కొనుగోలు కేంద్రం వద్ద గాని సకాలంలో డంపింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సొసైటీ గ్రామ సెక్రెటరీ, సెంటర్ ఇన్చార్జిలు, నోడల్ ఆఫీసర్, స్పెషల్ ఆఫీసర్ సమన్వయంతో పనిచేసి సరియైన రీతిలో రైతుల వద్ద వివరాలు సేకరించి ఆయా రైతులు ధాన్యాన్ని ఎక్కడికి తరలించాలో టోకెన్ పద్ధతి ద్వారా ముందుగానే తెలియజేయాలని అన్నారు. రైతుల ఆధార్ నెంబర్ ఆధారంగా ధాన్యం వివరాలు, వెహికల్ నెంబర్, సాగు చేసిన విస్తీర్ణం అమ్మకానికి వచ్చిన ధాన్యం వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి సక్రమంగా నమోదు చేయడం ద్వారా రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం విక్రయించడం జరుగుతుందని ఆమె తెలిపారు మిల్లర్లకు పోయే ధాన్యం తిరిగి పంపించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా హమాలీల కొరత లేకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జిల్లా మొత్తంలో హమాలీలకు రేటును నిర్ధారించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం సేకరణలో సంబంధిత శాఖలు సమన్వయంతో ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది కలగకుండా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, డీఆర్డీవో మేన శ్రీను, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వాజిద్ అలీ, సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మహేందర్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి అనురాధ, ఇతర శాఖల అధికారులు, ఐకెపి కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# విద్యార్థులలో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

**ప్రిన్సిపాల్ పి. జానకి దేవి**

### పాలిటెక్నిక్‌లో ఘనంగా ‘కార్నివాల్ సెలబ్రేషన్-2026’





సంగారెడ్డి, మార్చి 18 (పోలీస్ నిఘా) : సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థుల ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో ‘కార్నివాల్ సెలబ్రేషన్?2026’ కార్యక్రమాన్ని ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు.

కళాశాల ప్రిన్సిపల్ పి. జానకి దేవి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు, పాటలు, నాటికలు వంటి వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్నివాల్, ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. విద్యార్థులలో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ప్రిన్సిపల్ జానకి దేవి తెలిపారు. కార్నివాల్ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన వివిధ వినోద కార్యక్రమాలు, క్రీడా పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు విద్యార్థులు, తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు కళాశాల యాజమాన్యం తరచూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో EEE విభాగం హెచ్ఓడి వి. ఇందిరా ప్రియ దర్శిని, జనరల్ సెక్షన్ హెచ్ఓడి డాక్టర్ ఎస్.ఎన్. పద్మావతి, ECE ఇంచార్జ్ హెచ్ఓడి ఏ. విద్యాసాగర్, లైబ్రేరియన్ వెంకట్ రెడ్డి, బి. శ్రీనివాస్ గౌడ్, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ ఎమ్మెల్యే నాగరాజు ఉగాది శుభాకాంక్షలు

### ఉజ్వల భవిష్యత్తుకు ఈ “పరాభవ నామ” సంవత్సర ఉగాది పండుగా తోడ్పడాలని ఆకాంక్షించిన ఎమ్మెల్యే నాగరాజు



వరంగల్, మార్చి 18 (పోలీస్ నిఘా) : తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ మరియు వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలకు “శ్రీ పరాభవ నామ సంవత్సర” ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేసిన గౌరవ వర్ధన్నపేట శాసనసభ్యులు, విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు గారు మాట్లాడుతూ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు నింపాలని, కష్టాలు తొలగి ఆనందమయ జీవితానికి నాంది కావాలని ఆకాంక్షించారు. షడ్రుచుల సమ్మేళనంతో ప్రారంభమయ్యే ఉగాది తెలుగు సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుందని, కొత్త ఆశలు, లక్ష్యాలు, ఆలోచనలకు ఇది నాంది పలుకుతుందన్నారు. ఈ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరి జీవితాల్లో ఉజ్వల భవిష్యత్తు నెలకొని, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దోహదపడాలని కోరుకున్నారు. ఇందిరమ్మ రాజ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారంటీల ద్వారా ప్రజల జీవితాల్లో సంతోషం పెరగాలని అభిలషించారు. ఇక ఈ సంవత్సరంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, రైతులు అభివృద్ధి చెందాలని కోరుకున్నారు. అలాగే ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతున్న నేపథ్యంలో, ఈ సంవత్సరం నిరుద్యోగులకు ఉద్యోగాల సంవత్సరం కావాలని ఆకాంక్షించారు... ఈ “శ్రీ పరాభవ నామ సంవత్సరం”లో ఇంటింటా ఆయురారోగ్యాలు, సిరిసంపదలు, ఆనందాలు నిండాలని ఎమ్మెల్యే నాగరాజు ఆకాంక్షించారు.

## 22(ఏ)తో ఇళ్ల స్థలాలపై ఇబ్బందులు

### -అసెంబ్లీలో లేవనెత్తిన బీర్ల అయిలయ్య-



యాదగిరిగుట్ట, మార్చి 18 (పోలీస్ నిఘా) :రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22(ఏ) కారణంగా పేదలు, మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆలేరు ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అసెంబ్లీలో ప్రస్తావించారు. 8వ అసెంబ్లీ సమావేశంలో ఈ అంశంపై మాట్లాడిన ఆయన, ఈ చట్టం వల్ల వేలాది కుటుంబాలు తమ భూములపై పూర్తి హక్కులు వినియోగించుకోలేక ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు.ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టించడం సరికాదని అన్నారు. పేదల సంక్షేమం కోసం గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న చర్యలను గుర్తుచేసిన అయిలయ్య, ప్రభుత్వ భూములను ఇళ్ల స్థలాలుగా కేటాయించడం ద్వారా అనేక కుటుంబాలకు లాభం చేకూరిందని తెలిపారు.ప్రస్తుతం కూడా ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాల ద్వారా పేదలకు గృహ వసతి కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ప్రజా పాలనలో పేదల హక్కులను రక్షించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన అన్నారు. ఈ క్రమంలో సెక్షన్ 22(ఏ) కింద నిషేధిత జాబితాలో ఉన్న భూములను పునఃసమీక్షించి, అర్హులైన వారి స్థలాలను ఆ జాబితా నుంచి తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు. తద్వారా భూముల క్రయవిక్రయాలు సులభతరం అవుతాయని, ప్రజలకు ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు.ఆలేరు నియోజకవర్గంతో పాటు యాదాద్రి భువనగిరి జిల్లాలో అనేక గ్రామాల్లో దశాబ్దాలుగా నివసిస్తున్న ప్రజల ఇళ్ల స్థలాలు కూడా ఈ జాబితాలో ఉండటం పట్ల ఆందోళన వ్యక్తమవుతోందన్నారు.క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేసి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.


## విద్యార్థి యువజనోత్సవాలను జయప్రదం చేయండి

### -ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వేంకటేష్-




దేవరకొండ, మార్చి 18 (పోలీస్ నిఘా) : దేవరకొండ మండల కమిటీల ఆధ్వర్యంలో భగత్ సింగ్,రాజ్ గురు,సుఖదేవ్ ల 95 వర్ధంతి సందర్భంగా విద్యార్థి యువజనోత్సవాలు మార్చి 15 నుంచి 23 వరకు నిర్వహించే ఉత్సవాల పోస్టర్ ను దేవరకొండ పట్టణ కేంద్రంలో ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వేంకటేష్ ఆవిష్కరించి ఈ సందర్భంగా మాట్లాడుతూ.... భగత్ సింగ్,రాజ్ గుర్,సుఖదేవ్ ల ఆశయ సాధన కోసం యువత,విద్యార్థులు వారి ఆశయ సాధనకు కృషి చేయాలని, డ్రగ్స్ మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. అదేవిధంగా నేటి సమాజంలో విద్యార్థులు,యువత గంజాయి, డ్రగ్స్,మాదకద్రవ్యాలు బెట్టింగ్లకు దూరంగా ఉంటూ ఉన్నతమైన స్థాయిలో ముందుకు పోయే విధంగా ఉండాలని, ఈ పోటీ ప్రపంచంలో నిలబడి ఉండాలంటే చదువు ఒక్కటే మార్గమని అన్నారు, అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గల్లి స్థాయిలో త్యాగాలు చేయలేని వారు కూడా ఢిల్లీ స్థాయిలో ప్రచార ప్రచారాలు చేస్తున్నాయి తప్ప భగత్ సింగ్ రాజ్ గుర్, సుసుఖ్ దేవ్ లను ప్రచారం చేయాలంటే జంకుతున్నాయని, 23 సంవత్సరాలు వయసులోనే దేశ స్వాతంత్రం కోసం తన ప్రాణాన్ని తృణప్రాయంగా వదిలేసిన షాహిద్ భగత్ సింగ్, రాజ్ గుర్, సుసుఖ్ దేవ్ లకు భారతరత్న ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరైన పద్ధతి కాదని అన్నారు తక్షణమే వారి సేవలను గుర్తించి భారతరత్న అవార్డు ప్రకటించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎ.రాజేష్,ఎం లాలు,ఏ.ఈశ్వర్, ఎం అఖిల్,సి.చరణ్,శివ గణేష్, కె.అజయ్, జె.రాజేష్,ఉదయ్ కుమార్,శ్రీధర్,మనోజు,యశ్వంత, శ్రీకాంత్,శివ పాల్గొన్నారు.

## తెలుగు ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపిన డా. కొర్ర కిషన్ నాయక్



దేవరకొండ, మార్చి 18 (పోలీస్ నిఘా) : తెలుగు రాష్ట్రాల ప్రజలకు, ముఖ్యంగా సమాచార హక్కు చట్టం కార్యకర్తలకు ఉగాది పండుగ సందర్భంగా ఆర్టీఐ ఆక్టివిస్ట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు డా. కొర్ర కిషన్ నాయక్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగు ప్రజల జీవితాల్లో ఈ కొత్త ఏడాది సరికొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిలాగే, ప్రజలందరి జీవితాలు సుఖదుఃఖాలను సమానంగా స్వీకరిస్తూ, విజయపథంలో సాగాలని కోరారు. ముఖ్యంగా సమాచార హక్కు చట్టం ద్వారా సామాన్యుడికి బలం చేకూర్చేందుకు కృషి చేస్తున్న కార్యకర్తలందరూ ఈ ఏడాది మరింత ఉత్సాహంతో, పారదర్శకమైన సమాజం కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. లోకమంతా సుభిక్షంగా ఉండాలని, రైతాంగం పాడిపంటలతో విరాజిల్లాలని ఆయన ఆకాంక్షించారు.

# మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



**రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ**

**పేద ముస్లింలకు రంజాన్ కానుకల అందజేత**

**నియోజక వర్గానికి ఎక్కువ మొత్తంలో దుస్తుల కిట్‌ల కేటాయింపు పట్ల హర్షం**

వరంగల్, మార్చి 18 (పోలీస్ నిఘా) : మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ అభిప్రాయపడ్డారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్ (తూర్పు) నియోజకవర్గ పరిధిలో బుధవారం క్రిస్టల్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన "ఈద్ కా తోఫా" కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై పేద ముస్లిం లకు దుస్తులను బహుమతులుగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రంజాన్ పర్వదినం పరస్పర ప్రేమ, దయ, త్యాగానికి ప్రతీక అని సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత బలపడేలా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని, పండుగల సందర్భంగా అవసరమైన సహాయాన్ని అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, ముఖ్యమంత్రి మైనారిటీల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను కొనియాడిన మంత్రి మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలకు 3500 "ఈద్ కా తోఫా"లను అందజేస్తున్నందుకు ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈద్ పర్వదినం అందరికీ శాంతి, సౌభాగ్యాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈద్ కా తోఫా ల అందజేత వల్ల నిరుపేద ముస్లిం లు పండగను సంతోషం గా ఆనందం గా జరుపుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ, రంజాన్ మనుషుల్లో మనస్ఫూర్తి, కరుణ, పరస్పర గౌరవాన్ని పెంపొందించే పవిత్రమైన పర్వదినమని తెలిపారు. సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందాలంటే పరస్పర సహకారం అవసరమని, ప్రభుత్వ పథకాలు అందరికీ చేరేలా అధికారులు కృషి చేస్తున్నారని చెప్పారు. పండుగలు మనలను ఒకటిగా కలిపే వేదికలని, ఇలాంటి కార్యక్రమాలు సామాజిక ఐక్యతను మరింత బలపరుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఫుర్ఖాన్, సోమిశెట్టి ప్రవీణ్ కుమార్, చింతాకుల అనిల్ కుమార్ బస్వరాజు కుమార స్వామి ఆర్ డి వో సుమ, డిఎండబ్ల్యూ ఓ రమేష్, బల్దియా డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, తహసిల్దార్లు ఇక్బాల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

# తాళం వేసిన ఇళ్లే దొంగల టార్గెట్

## ప్రజలారా అప్రమత్తం!




ఉమ్మడి ఆదిలాబాద్ , మార్చి 18 (పోలీస్ నిఘా) : జన్నారంలో వరుస దొంగతనాల నేపథ్యంలో సీఐ రమణ మూర్తి కీలక సూచనలు జన్నారం మండలంలో ఇటీవల చోటుచేసుకుంటున్న వరుస దొంగతనాలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో లక్సెట్టిపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) రమణ మూర్తి ప్రజలకు ప్రత్యేక హెచ్చరికలు జారీ చేశారు. దొంగలు తాళం వేసి ఉన్న ఇళ్లనే ప్రధాన లక్ష్యంగా చేసుకుంటున్నారని, ప్రజలు తమ ఆస్తిపాస్తుల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు.

**ముఖ్యమైన జాగ్రత్తలు: ఇల్లు వదిలి వెళ్తున్నారా?**

వ్యాపార రీత్యా గానీ, శుభకార్యాల కోసం గానీ ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేవారు ఈ క్రింది సూచనలు తప్పనిసరిగా పాటించాలని పోలీసులు కోరుతున్నారు:

**నగదు, నగలు ఇంట్లో ఉంచకండి:** ప్రయాణాలకు వెళ్లేటప్పుడు ఇంట్లోని విలువైన బంగారు ఆభరణాలు, నగదును వెంట తీసుకెళ్లడం లేదా బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం ఉత్తమం.

**పోలీసులకు సమాచారం ఇవ్వండి:** ఎక్కువ రోజులు ఊరికి వెళ్లాల్సి వస్తే సంబంధిత స్థానిక పోలీస్ స్టేషన్‌లో ముందస్తు సమాచారం అందించాలి. దీనివల్ల పోలీసులు ఆ ప్రాంతాల్లో గస్తీ పెంచే అవకాశం ఉంటుంది.

**సీసీ కెమెరాల నిఘా:** ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద, వీధుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. నేరస్థులను గుర్తించడానికి మరియు నేరాలను అరికట్టడానికి ఇవి కీలకంగా పనిచేస్తాయి.

"ప్రజల భాగస్వామ్యం లేకుండా నేరరహిత సమాజాన్ని నిర్మించడం సాధ్యం కాదు. ఇరుగుపొరుగు ఇళ్లకు తాళం వేసి ఉంటే వాటిపై కూడా ఒక కన్నేసి ఉంచాలి."

**▶▶ –సీఐ రమణ మూర్తి**

**గ్రామాల్లో 'దప్పు చాటింపు'కు ఆదేశం**

నేరాల నివారణలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు తమ పరిధిలో దప్పు చాటింపు వేయించాలని సీఐ ఆదేశించారు. ప్రజల్లో చైతన్యం కల్పించడం ద్వారానే దొంగతనాలకు అడ్డుకట్ట వేయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

అనుమానితులపై నిఘా: గ్రామాల్లో కొత్త వ్యక్తులు ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు కనిపిస్తే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.

# ఓటర్ల మ్యాపింగ్, సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి

**సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య**




సంగారెడ్డి, మార్చి 18 (పోలీస్ నిఘా) : జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్, ఇంటింటి సర్వే ప్రక్రియలో నిర్లక్ష్యం వహించిన బిఎల్ఓలకు తాకిదులు తప్పవని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య స్పష్టం చేశారు . ప్రతి ఇంటికి వెళ్లి నిజమైన ఓటర్లను గుర్తిస్తూ మ్యాపింగ్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఈ ఆర్ ఓ లు, ఏ ఈ ఆర్ఓ లు, బిఎల్వోలు, సూపర్వైజర్ల ను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో పటాన్చెరువు, సంగారెడ్డి, జహీరాబాద్ ప్రాంతాలకు చెందిన ఈ ఆర్ ఓ లు, ఏ ఈ ఆర్ఓ లు, బిఎల్వోలు, సూపర్వైజర్లతో వీడియో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి బిఎల్ఓ తన పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించి ఎస్ఐఆర్ మ్యాపింగ్ పక్రియను వేగవంతం చేయాలని అన్నారు . ఓటర్ల జాబితా ఖచ్చితత్వం కోసం నిర్వహించే ఎస్ఐఆర్ ప్రక్రియలో బిఎల్ఓలు కీలక పాత్ర పోషించాలని అన్నారు .బిఎల్ఓ లు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని తెలిపారు . ఎస్ఐఆర్ మ్యాపింగ్ పక్రియలో నిర్లక్ష్యం వహించే బిఎల్వోలకు తాకిదులు తప్పవని స్పష్టం చేశారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బిఎల్వో తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, బిఎల్వోలు లేని పోలింగ్ కేంద్రాలకు వెంటనే బిఎల్వోలను నియమించాలని ఈ ఆర్ ఓ లను ఆదేశించారు . ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం 13 కేటగిరీలలో బిఎల్వోలనునియమించుకోవచ్చని అన్నారు. బిఎల్వోల వివరాలను ఈసీఐ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ ఆర్ ఓ లు ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు, ఆర్డీవో రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.






## ఆర్టీసీ ఉద్యోగులకు సంస్థ షాక్

హైదరాబాద్, మార్చి 18 (పోలీస్ నిఘా) : ఆర్టీసీ ఉద్యోగులు, అధికారులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బిగ్ షాక్ ఇచ్చింది. ఫ్యామిలీ ప్లానింగ్ స్కీం కింద ఇచ్చే స్పెషల్ ఇంక్రిమెంట్‌ను రద్దు చేస్తూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీ బోర్డు తీర్మానం ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ వెల్లడించింది. ఇకపై ఉద్యోగులు, వారి జీవిత భాగస్వామి.. ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకున్నా ఈ ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇవ్వబోమని యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ మేరకు టీజీఎస్ఆర్టీసీ సర్క్యులర్ జారీ చేసింది.

# విద్యార్థుల్లో జీవన నైపుణ్యాల అభివృద్ధికి 'స్ఫూర్తి' కార్యక్రమం: కలెక్టర్




వరంగల్, మార్చి 18 (పోలీస్ నిఘా) : విద్యార్థుల్లో జీవన నైపుణ్యాల పెంపొందనకు, మానసిక దృఢత్వం అభివృద్ధికి 'స్ఫూర్తి' కార్యక్రమం ఎంతో ఉపయుక్తమని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. ప్రజా పాలన పట్టణ ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా బుధవారం వరంగల్ పట్టణంలోని ప్రభుత్వ సీకేఎం కళాశాలలో నిర్వహించిన 'స్ఫూర్తి' కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సీఈఓ రామ్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా. ధర్మారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా. వరప్రసాద్, డిబీసీడీఓ పుష్పలత, ఆర్డీవో సుమలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ జీవితంలో స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, క్రమశిక్షణతో చదివితే ఏ లక్ష్యాన్నైనా సాధించగలరని అన్నారు. భయాన్ని జయిస్తే విజయాన్ని అందుకోవడం సులభమవుతుందని, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల పోస్ట్ గ్రాడ్యుయేట్, గ్రాడ్యుయేట్ విద్యార్థులతో పాటు సమీప ప్రభుత్వ పాఠశాల 6వ నుండి 8వ తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించి, వారి భవిష్యత్ లక్ష్యాలపై చర్చించారు. విద్యార్థులు ఎదుర్కొనే ఒత్తిడి, పోటీ, సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ తమ సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ప్రేరేపించారు. శారీరక అభివృద్ధితో పాటు మానసిక అభివృద్ధి కూడా సమానంగా అవసరమని పేర్కొంటూ, పర్సనాలిటీ డెవలప్మెంట్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్, టైమ్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో భయాన్ని తొలగించి, వారిని సృజనాత్మకంగా తీర్చిదిద్దడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించిన మండల అధ్యక్షుడు సిద్దన రమేష్

**గ్రామాల అభి వృద్దే లక్ష్యంగా పని చేస్తాం..**

**మండల అధ్యక్షుడు సిద్దన రమేష్ గ్రామ సర్పంచ్ గూడ సంధ్య మహేందర్**





చెన్నారావుపేట, మార్చి 18 (పోలీస్ నిఘా) : అభివృద్దే లక్ష్యంగా పని చేస్తామని మండల అధ్యక్షుడు సిద్దన రమేష్ గ్రామ సర్పంచ్ గూడ సంధ్య మహేందర్ అన్నారు. చెన్నరావుపేట మండలంలోని ఖాదర్ పేట గ్రామంలో బుధ వారం ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సహ కారంతో ఎన్ ఆర్ఈ జిఎస్ నిధులు ఎస్సి సబ్ ప్లాన్ నిధు లతో సుమారు 15 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సిద్దన రమేష్ గ్రామ సర్పంచ్ గూడ సంధ్య మహేందర్ గ్రామ ఉప సర్పంచ్ చాపల మధు కర్ కొబ్బరికాయ కొట్టి పనులని ప్రారంభిం చారు.. ఈ సందర్భంగా గ్రామ అభి వృద్దే ల క్ష్యంగా కాంగ్రెస్ ప్రభు త్వం పని చేస్తోం దని గ్రామంలో ప్రతి వాడకు సీసీ రోడ్డు నిర్మాణాన్ని ఎమ్మెల్యే దొంతి సహకా రంతో చేపడుతమని మండల అధ్యక్షుడు సిద్దన రమేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి కి నోచు కోలేదని మాయ మాటలతో మోసం చేసారని ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభి వృద్ధిని ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు.. గ్రామ సర్పంచ్ గూడ సంధ్య మహేందర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మా గ్రామం అబివృద్ధి కి నోచుకోలేదని గత ప్రభుత్వ హయాంలో అబి వృద్ది కుంటు పడిందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ మాజీ ఎంపిపి కేతిడి వీరా రెడ్డి బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్ వర్కింగ్ ప్రెసిడెంట్ తప్పెట రమేష్ ఆయా గ్రామాల సర్పంచ్ లు శ్వేత క్రిష్ణ చైతన్య ఉమా మో హన్ నాయక్ మైబు సింగ్ రాథోడ్ బాలు నాయక్ మార్కెట్ డైరెక్టర్ చీర అశోక్ ఏఈ సృజన్ వర్క్ ఇన్స్పెక్టర్ రఘు మాజీ సర్పంచ్లు మాజి ప్రజా ప్రతినిధులు ఆయా గ్రామాల ఉప సర్పంచ్లు ఆయా గ్రామాల కాంగ్రెస్ అధ్యక్షులు గ్రామ కాంగ్రెస్ నాయకులు కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రెండవ రోజు ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు నిరసన

**మధ్యాహ్నం భోజన విరామం సమయంలో నల్ల రిబ్బన్స్ పెట్టుకొని నిరసన తెలిపిన ఉద్యోగులు**

**పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఎన్ హెచ్ ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా**



వరంగల్, మార్చి 18 (పోలీస్ నిఘా) : వరంగల్ జిల్లాలోని 32 డివిజన్ ప్రాంతంలో ఎస్.ఆర్. ఆర్.తోట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు లంచ్ సమయంలో నల్ల రిబ్బన్లు ధరించి వేతనాలు ప్రభుత్వం తక్షణమే వేతనాలు విడుదల చేయాలని ఉద్యోగులకు నిరసన వ్యక్తం చేసిన ఎన్.హెచ్.ఎం ఉద్యోగులు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్ హెచ్ ఎమ్) కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగులుకు తమకు రావలసిన 5 నెలల పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ఈ సందర్భంగా మాట్లాడుతూ, నెలల తరబడి జీతాలు అందక ఉద్యోగులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగుల ఆవేదన.. జీవన సంక్షోభం వేతనాల అలస్యంతో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు

ఇంటి అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు. విద్యుత్ బిల్లులు పెండింగ్లో పడటం పిల్లల విద్యా ఫీజులు చెల్లించలేక ఒత్తిడి గురికావడం. ఈఎంఐలు (వాయిదాలు) నిలిచిపోవడం (గత సంవత్సరం 2025 సెప్టెంబర్ నుండి జనవరి 2026 వరకు) మొత్తం 5 నెలల వేతనాలు బకాయిలు పెండింగ్లో ఉన్నాయని, తక్షణమే చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎన్ హెచ్ ఎం ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం ప్రభుత్వాన్ని చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఆర్.ఆర్ తోట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నర్సింగ్ ఆఫీసర్లు గుడి కందుల వాణి, మేకల మంజుల, ఫార్మసీ ఆఫీసర్ నూకల అంజి యాదవ్, ల్యాబ్ టెక్నీషియన్ జూకంటి మౌనిక, ఏ.ఎన్.ఎం.లు దాసరి నర్మద , కే.సంధ్య, ఆశా కార్యకర్త సులోచన మరియు తదితరులు పాల్గొన్నారు.

# మక్కలు మార్కెట్లోకి వచ్చినా కొనుగోళ్లు ఏవీ?




హైదరాబాద్, మార్చి 18 (పోలీస్ నిఘా): మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిలదీస్తూ, రైతులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్‌పార్క్ నుంచి అసెంబ్లీ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్ రావు, ఎమ్మెల్సీ శ్రవణ్, ఎమ్మెల్యేలు ఆందోళనకు దిగారు. మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని నినాదాలు చేశారు. మార్కెట్లకు పోటెత్తిన మక్కలను కొనుగోలు చేయకపోవడంతో రైతన్నకు తిప్పలు అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. మొక్కజొన్నలతో గన్‌పార్క్‌లో గులాబీ పార్టీ నేతలు నినాదాలు చేసారు. అక్కడి నుంచి కాలి నడకన అసెంబ్లీకి వెళ్లారు. ఈ సందర్భంగా గన్‌పార్క్ వద్ద తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించిన అనంతరం మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై మండిపడ్డారు. వరి వేయొద్దని, పంట మార్పిడి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పదేపదే చెబితే ఆ మాటలు నమ్మి రాష్ట్రంలో రైతులు సుమారు 8 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారని తెలిపారు. తీరా పంట చేతికి వచ్చాక ఆ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచుతోందని అన్నారు. మొక్కజొన్న మార్కెట్లకు రావడం మొదలై ఇప్పటికే 15 రోజులు అవుతున్నా, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం దారుణమని మండిపడ్డారు. దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మొక్కజొన్నకు మద్దతు ధర రూ. 2400 ఉంటే కొనుగోలు కేంద్రాలు లేక రైతులు దళారులకు రూ.1600 నుంచి రూ.1700లకే అమ్ముకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. పదిహేను రోజులుగా కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడం చూస్తుంటే ప్రభుత్వ ఆంతర్యం ఏమిటో అర్థమవుతోందన్నారు. పంట దళారుల పాలైన తర్వాత ఆ దళారుల దగ్గర ఎక్కువ ధరకు కొని వాళ్లకు మేలు చేయాలని ప్రభుత్వం చూస్తోందా అని ప్రశ్నించారు. ఒకవైపు మద్దతు ధర లేక నష్టపోతుంటే మరోవైపు అకాల వర్షాలకు మార్కెట్ యార్డుల్లో, కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న తడిచిపోయి రైతులు కన్నీరు పెడుతున్నారని తెలిపారు. రెండు రోజులుగా కురిసిన వడగండ్ల వానలకు మొక్కజొన్న, మామిడి సహా ఇతర పంటలకు పెద్ద ఎత్తున నష్టం జరిగిందన్నారు. బ్జడెట్‌లో పంటల బీమా గురించి గొప్పగా ఊదరగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో అమలు చేయడం లేదని చెప్పారు. ఈ ప్రభుత్వం అటు పంటల బీమా అమలు చేయదు, ఇటు ఇన్ పుట్ సబ్సిడీ ఇవ్వదని మండిపడ్డారు. గత రెండు సంవత్సరాలుగా రాష్ట్ర రైతాంగానికి ఇన్ పుట్ సబ్సిడీ అందడం లేదని తెలిపారు. ప్రభుత్వం కేవలం మాటల్లో చెబుతున్నదే తప్ప ఇప్పటివరకు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు సబ్సిడీ నిధులను విడుదల చేయడం లేదన్నారు. అకాల వర్షాలు, వడగండ్ల వానల వల్ల జరిగిన నష్టంపై అన్ని జిల్లాల నుంచి వెంటనే నివేదికలు తెప్పించుకోవాలని సూచించారు. తక్షణమే ఎన్యూమరేషన్ చేసి నష్టపోయిన రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. 25 శాతం పంట దళారుల చేతికి వెళ్లిందన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, రూ.2400 మద్దతు ధర, రూ.500 బోనస్ ప్రభుత్వం వెంటనే చెల్లించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. మొక్కజొన్న రైతులను కాంగ్రెస్ సర్కార్ ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో మార్షల్స్ దురుసుగా ప్రవర్తించారు. ప్రవేశద్వారం వద్ద ఎమ్మెల్యేల నుంచి మక్కలు, కందులు లాక్కున్నారు. ఈ క్రమంలో హరీష్ రావు చేతికి గాయమై రక్తం వచ్చింది. మరోవైపు అసెంబ్లీ ఎంట్రన్స్ వద్ద పాడి కౌశిక్ రెడ్డి చేతిలో నుంచి చీఫ్ మార్షల్ కరుణాకర్ మక్కలు లాక్కొని కిందబోశారు. మార్షల్స్ తీరుపై ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ గేటు వద్ద కూర్చొని మార్షల్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# నివాస భవనాల్లో అగ్నిప్రమాదాలు

## 17 మంది మృతి




న్యూఢిల్లీ, మార్చి 18 : ఢిల్లీ, ఇండోర్‌లలోని పలు నివాస భవనాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించడంతో 17మంది మృతి చెందారు. ఢిల్లీలోని పాలం ప్రాంతంలోని ఓ బహుళ అంతస్తుల భవనంలో బుధవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో పిల్లలతో సహా ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిదిమంది మరణించినట్లు అధికారులు వెల్లడించారు. మంటల నుంచి తప్పించుకోవడానికి భవనం పైనుంచి దూకిన ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. ప్రస్తుతం వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. మరో ఘటనలో ఇండోర్‌లోని ఓ నివాస భవనం బయట ఉన్న ఎలక్ట్రిక్ వాహనం ఛార్జింగ్ పాయింట్ పేలిపోయి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన 8 మంది మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు పిల్లలు, ముగ్గురు మహిళలు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. మరో ముగ్గురు వ్యక్తులను మంటల నుంచి కాపాడి ఆస్పత్రికి తరలించామన్నారు. కారు ఛార్జ్ అవుతున్న సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించినట్లు స్థానికులు పేర్కొన్నారు. మంటలు భవనంలోకి వ్యాపించడంతో ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ కూడా పేలినట్లు అధికారులు తెలిపారు. దీంతో మంటలు మరింత తీవ్రమయ్యాయన్నారు. ఈవీ ఛార్జింగ్ పాయింట్ పేలడానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.

## 2,200 కిలోల బంకర్ బస్టర్లతో..

# హర్మూజ్ వద్ద విరుచుకుపడిన అమెరికా

## పొరుగు దేశాలకు ఇరాన్ హెచ్చరికలు




వాషింగ్టన్, మార్చి 18 : పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు రగులుతూనే ఉన్నాయి. చమురు రవాణాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధిని నియంత్రిస్తోన్న ఇరాన్‌ను అడ్డుకునేందుకు అమెరికా తాజాగా భీకర దాడులకు దిగింది. ఈ జలసంధి సమీపంలోని భూగర్భ క్షిపణి స్థావరంపై అత్యంత శక్తిమంతమైన బాంబులతో విరుచుకుపడింది. ఈ విషయాన్ని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. "హర్మూజ్ జలసంధికి సమీపంలోని ఇరాన్ క్షిపణి స్థావరాల్లో ఉన్న యాంటీ-షిప్ క్రూజ్ క్షిపణులు.. అంతర్జాతీయ సముద్ర రవాణాకు ముప్పుగా మారాయి. అందుకే ఈ స్థావరాన్ని లక్ష్యంగా చేసుకున్నాం. లోతుగా చొచ్చుకుపోయే 5వేల పౌండ్ల (దాదాపు 2200 కిలోలకు పైమాటే) శక్తిమంతమైన బంకర్ బస్టర్ బాంబులతో విజయవంతంగా దాడులు చేశాం" అని యూఎస్ సెంట్రల్ కమాండ్ 'ఎక్స్' ఖాతాలో వెల్లడించింది. ఇరాన్ తీర రక్షణ నెట్‌వర్క్‌లో భాగమైన ఆయుధ నిల్వలు, క్షిపణి ప్రయోగ కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నట్లు అమెరికా తెలిపింది. హర్మూజ్‌లో చమురు రవాణా నిరంతరాయంగా కొనసాగాలంటే ఈ నెట్‌వర్క్‌ను విచ్ఛిన్నం చేయాల్సిన అవసరం ఉందని అగ్రరాజ్యం భావిస్తోంది. తద్వారా ఈ జలసంధి మార్గంలో వెళ్లే నౌకలపై ఇరాన్ దాడులు చేయకుండా అడ్డుకుంటామని తాజా చర్యతో అమెరికా సంకేతాలిచ్చినట్లయ్యింది.

**పొరుగు దేశాలకు ఇరాన్ హెచ్చరికలు**

తమ ఇంధన మౌలిక సదుపాయాలపై జరిగిన దాడులకు ప్రతిగా పొరుగున ఉన్న గల్ఫ్ దేశాలకు ఇరాన్ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. సౌదీ అరేబియా, ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లోని చమురు, గ్యాస్ మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తామని హెచ్చరించింది. ఈ మేరకు ఆ దేశానికి చెందిన టెహ్రాన్ టైమ్స్ పోస్టులు పెట్టింది. వీటిపై మరికొన్ని గంటల్లో దాడులు చేయబోతున్నట్లు ఇరాన్ హెచ్చరించింది. ఇరాన్‌లోని అతిపెద్ద గ్యాస్‌ఫీల్డ్ అయిన సౌత్ పార్స్ మౌలిక సదుపాయాలపై బుధవారం దాడి జరిగింది. దీనికి ఇజ్రాయెల్, అమెరికానే కారణమని ఇరాన్ ఆరోపిస్తోంది. మరోవైపు ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఎస్మాయిల్ ఖతీబ్, సీనియర్ భద్రతా అధికారి అలీ లారిజానీ, బసీజ్ ఫోర్స్ అధిపతి జనరల్ గులాం రెజా సాల్మనీ మృతి చెందారు. టాప్ లీడర్ల మరణం నేపథ్యంలో ఇరాన్ నుంచి తీవ్రస్థాయిలో హెచ్చరికలు రావడం గమనార్హం.

# రాష్ట్రంలో గూండా రాజ్యం నడుస్తోంది

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు



నల్గొండ, మార్చి 18 (పోలీస్ నిఘా) : రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కనుమరుగై గూండారాజ్యం నడుస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు ఆరోపించారు. కాంగ్రెస్ కార్యకర్తల పాశవిక దాడిలో గాయపడి నల్గొండ జిల్లా ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బీజేపీ కార్యకర్తలను బుధవారం పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చండూరు మున్సిపాలిటీలో ఆదివారం సాయంత్రం కాంగ్రెస్ నాయకులు తమ అనుచరులతో కలిసి బీజేపీ కార్యకర్తలపై హత్యాయత్నానికి పాల్పడ్డారని, ఈ దాడిలో ఆరుగురు కార్యకర్తలకు తీవ్ర గాయాలవ్వగా ప్రస్తుతం నలుగురు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. గతంలో చండూరు మున్సిపాలిటీలో బీజేపీ తరపున పోటీ చేసిన కిరణ్‌పై రాజకీయ కక్షతో స్థానిక ఎమ్మెల్యే ప్రోత్సాహంతోనే ఈ దాడులు జరిగాయన్నారు. బాధితులకు కనీసం హాస్పిటల్‌లో సరైన సమయానికి వైద్యం అందకుండా కూడా అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. ఇంత తీవ్రమైన ఘటన జరిగినా పోలీసులు నిందితులపై కఠిన సెక్షన్లు పెట్టకుండా సాధారణ కేసులు నమోదు చేసి సరిపెట్టారని, పైగా బాధితులైన బీజేపీ కార్యకర్తలపైనే కౌంటర్ కేసులు పెట్టడం పోలీసు వ్యవస్థ కాంగ్రెస్ కనుసన్నల్లో నడుస్తున్నదనడానికి ఇది నిదర్శనమని ఆయన ఆరోపించారు. పెద్దపల్లి, మంచిర్యాల, నల్గొండ వంటి అనేక ప్రాంతాల్లో పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తూ బీజేపీ నాయకులను అణచివేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డిపై ఒక డీఎస్పీ చేయిచేసుకోవడం అత్యంత దారుణమన్నారు. కాంగ్రెస్ నాయకులు భూ ఆక్రమణలు, డ్రగ్స్, లిక్కర్, బెల్ట్ షాపుల దందాలను యథేచ్ఛగా నడిపిస్తున్నారని పేర్కొన్నారు. పవిత్రమైన వైద్య వృత్తిలో ఉన్న వారు కాంగ్రెస్ నాయకుల ఒత్తిళ్లకు భయపడొద్దని, బాధితులకు సరైన వైద్యం అందించాలని కోరుతున్నామన్నారు. ప్రజలు కాంగ్రెస్ నాయకుల అరాచకాలను గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బీజేపీ కార్యకర్తలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ మీకు పూర్తి అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడితే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. దోషులకు శిక్ష పడే వరకు విశ్రమించే ప్రసక్తే లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమని రామచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు.

## తెలుగు ప్రజలకు డిప్యూటీ సీఎం ఉగాది శుభాకాంక్షలు



హైదరాబాద్, మార్చి 18 (పోలీస్ నిఘా) : తెలుగువారందరికీ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. తెలుగువారిలో కొత్త ఆనందాలు తెచ్చే పండుగల్లో ఉగాదికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఉగాది పర్వదినాన్ని అందరూ సంతోషంగా జరుపుకోవాలంటూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ పరాభవ నామ సంవత్సరం మీ ఆశలు, ఆశయాలు నెరవేరి ఏడాది పొడవునా సుఖసంతోషాలతో జీవించాలని, రాష్ట్ర ప్రజలకు అన్ని శుభాలు కలగాలని, సకల విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి సిరుల పంటలు పండాలని, సకల వృత్తుల వారికి మేలు కలగాలని, పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా ప్రతీ ఇల్లు కళకళలాడాలని, మన సంస్కృతి సంప్రదాయాలు కలకాలం వర్ధిల్లాల్లాలని కోరారు.

**రామచందర్ రావు శుభాకాంక్షలు**

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తెలుగు ప్రజలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ శుభసందర్భంగా విశ్వవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరకూ ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం, విజయాలు కలగాలని ఆకాంక్షించారు. ఉగాది కొత్త సంవత్సరానికి నాంది పలుకుతూ ఆశలు, ఆకాంక్షలకు శ్రీకారం చుడుతుందని, ఈ పండగ ప్రతి ఇంటికీ సంతోషం, శాంతిని తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ పండగ రైతుల జీవితాలలో ఆనందాలు నింపాలని, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నానన్నారు. 2026 సంవత్సరం ప్రతి బీజేపీ కార్యకర్తకు ప్రత్యేకమైనదని, ఎందుకంటే ఇది భారతీయ జనసంఘ్ స్థాపన జరిగి 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఒక గర్వకారణమని ఆయన తెలిపారు. ఈ మైలురాయి పార్టీ కార్యకర్తలందరికీ ప్రేరణనిచ్చే సందర్భమని, జాతీయత, సేవాభావం, ప్రజల పట్ల అంకితభావంతో కూడిన సంస్థ గొప్ప వారసత్వాన్ని గుర్తు చేస్తుందని అన్నారు. ఈ ఉగాది ప్రతి కార్యకర్తను సమాజ సేవలో, దేశ సేవలో మరింత క్రమశిక్షణతో ముందుకు సాగేందుకు ప్రేరేపించాలని రామచందర్ రావు ఆకాంక్షించారు.

# బడ్జెట్‌లో బీసీలకు 50% కేటాయించాలి: తలసాని



హైదరాబాద్, మార్చి 18 (పోలీస్ నిఘా) : జనాభాలో 50 శాతం ఉన్న బీసీలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హా ప్రకారం బీసీల సంక్షేమానికి ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ. 20 వేల కోట్లు కేటాయించాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాలలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇప్పటికే రెండు బడ్జెట్‌లు అయిపోయాయని అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు రూ. 10 వేల కోట్ల వరకు ఉన్నాయని, వెంటనే వాటిని ప్రభుత్వం చెల్లించాలని కోరారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల కారణంగా అనేకమంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించే బీసీ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించేందుకు జ్యోతిరావు పూలే ఓవర్సీస్ కార్యక్రమాన్ని కేసీఆర్ తీసుకొచ్చారని, ఆ పథకం క్రింద అర్హులైన విద్యార్థులకు వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ బీసీ వర్గాలను చిన్నచూపు చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హా ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అసెంబ్లీలో బిల్లు పెడితే చట్టబద్ధత రాదని, కేంద్ర ప్రభుత్వం 9 వ షెడ్యూల్ లో చేరిస్తేనే చట్టబద్ధత వస్తుందన్న విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తే పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు హాజరుకాకపోవడం బీసీల పట్ల వారికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. బీసీ సమస్యల పై కాంగ్రెస్ పార్టీలోని బీసీ వర్గాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు.

# యూట్యూబర్ వైష్ణవి హత్య కేసులో కీలక మలుపు



జగిత్యాల, మార్చి 18 (పోలీస్ నిఘా) : జగిత్యాల జిల్లాలో సంచలనం సృష్టించిన యూట్యూబర్ వైష్ణవి హత్య కేసులో తాజా పరిణామాలు దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉంటూ అందరినీ అలరించిన ఓ యువతి, అదనపు కట్నం వేధింపులకు బలి కావడం అత్యంత విచారకరం. ఈ కేసులో పోలీసులు వేగంగా స్పందించి నిందితుడిని పట్టుకున్నారు.

**రిమాండ్‌కు తరలింపు..**

నిందితుడు హరిబాబు, వైష్ణవిని అదనపు కట్నం కోసమే హత్య చేసినట్లు పోలీసుల విచారణలో అంగీకరించాడు. నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు, కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

**కుటుంబ సభ్యులపై దర్యాప్తు..**

ఈ హత్య కేవలం హరిబాబు ఒక్కడే చేశాడా..? లేదా కుటుంబ సభ్యుల ప్రోద్బలం ఏమైనా ఉందా? అనే కోణంలో పోలీసులు సమగ్రంగా విచారిస్తున్నారు. ఘటనా స్థలంలో లభించిన క్లూస్, ఫోరెన్సిక్ ఆధారాలు ఈ కేసులో నిందితుడికి శిక్ష పడటంలో కీలక పాత్ర పోషించనున్నాయి. వరకట్న వేధింపులు లాంటి కేసుల్లో నిందితులకు కఠినమైన శిక్ష పడితేనే, భవిష్యత్తులో ఇటువంటి అకృత్యాలను అరికట్టే అవకాశం ఉంటుందని పలువురు చెబుతున్నారు.

**ఆడియో కాల్ లీక్..**

యూట్యూబర్ వైష్ణవి హత్య కేసులో మరో కీలక మలుపు చోటుచేసుకుంది. ఈ కేసులో సంచలన ఆడియో కాల్ లీక్ అయింది. ఈ ఆడియో కాల్‌లో వైష్ణవి హత్యకు ముందు ఆమె అత్తతో మాట్లాడింది. వైష్ణవిని హరిబాబు తల్లి లక్ష్మి అభ్యంతరకరంగా దూషించినట్లు ఈ ఆడియో కాల్‌లో ఉంది. బెడ్ రూమ్‌లో ఉంగరం దొంగిలించారని అభ్యంతరకరంగా హరిబాబు తల్లి మాట్లాడింది. తల్లితో ఫోన్ మాట్లాడినప్పుడు వైష్ణవితోనే హరిబాబు ఉన్నారు. ఉంగరం పేరుతో నాటకాలు ఆడవద్దని తన తల్లిని హరిబాబు హెచ్చరించారు.



## చిన్నారికి ఓపెన్ హార్ట్ సర్జరీ

### అండగా నిలిచిన ఇనగాల

### ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత ఇనగాల వెంకట్రామ్ రెడ్డి





హనుమకొండ, మార్చి 18 (పోలీస్ నిఘా) : పరకాల పట్టణానికి చెందిన బొచ్చు శరత్–చైతన్య దంపతుల 6 నెలల కుమార్తె ఋత్వికకు గుండె సంబంధిత సమస్య ఉండటంతో, అత్యవసరంగా శస్త్రచికిత్స చేయాలని వైద్యులు తెలిపారని, చికిత్సకు అవసరమైన భారీ ఖర్చు భరించలేని స్థితిలో ఉన్న ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో హనుమకొండ డీసీసీ అధ్యక్షులు మరియు కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి గారిని కలిసి తమ ఆవేదనను వివరించారు. తక్షణమే స్పందించి అపోలో హాస్పిటల్స్ మరియు 'అపోలో ఫౌండేషన్ హృదాన్ ప్రోగ్రామ్' ద్వారా ' ఇనగాల ఛారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని అపోలో హాస్పిటల్‌లో చిన్నారికి ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించారు. ప్రస్తుతం చిన్నారి కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. తమ బిడ్డకు పునర్జన్మను ఇచ్చిన ఇనగాల వెంకట్రామ్ రెడ్డి గారికి, ఇనగాల ఛారిటబుల్ ట్రస్ట్‌కు ఆ తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమై కృతజ్ఞతలు తెలిపారు.

## పూర్వ విద్యార్థిని చైర్ పర్సన్‌గా చూడటం గర్వకారణం: ప్రిన్సిపాల్ రమావత్ రవి



దేవరకొండ , మార్చి 18 (పోలీస్ నిఘా) : మునగల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) దేవరకొండలో ఈరోజు ఆర్ట్స్ గ్రూప్ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా పున్న శైలజ (లయన్ లేడీ) డబ్ల్యు/ఓ పున్న వెంకటేశ్వర్లు దేవరకొండ మున్సిపల్ చైర్ పర్సన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రమావత్ రవి మాట్లాడుతూ ఇక్కడి నుండి వెళ్ళిన విద్యార్థులంతా భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో ఉండాలని పేర్కొన్నారు. అలాగే ముఖ్య అతిథిగా విచ్చేసిన పున్న శైలజ దేవరకొండ మున్సిపల్ చైర్ పర్సన్ మా కళాశాల పూర్వ విద్యార్థి కావడం మాకు ఎంతో గర్వకారణం అని చైర్ పర్సన్ పదవి స్వీకరించిన తర్వాత మొదటిసారిగా మా కళాశాలకు విచ్చేసి విద్యార్థులకు వారి భవిష్యత్తుకు సంబంధించి మంచి ఉపన్యాసాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ సి. లింగమయ్య, సీవోఈ జి. లింగారెడ్డి డాక్టర్ కె. పృథు, డాక్టర్ కె.రేణుక, డాక్టర్ వి.మకట్లాల్, డాక్టర్ ఎం ప్రభాకర్, పి.మధు, ఎస్. వెంకటరెడ్డి తదితర అధ్యాపకులు అధ్యాపకేతరులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలకు మోసాలకు తావులేకుండా అవగాహన కలిగించాలి: అదనపు కలెక్టర్





వరంగల్, మార్చి 18 (పోలీస్ నిఘా) : ప్రపంచ వినియోగదారుల హక్కుల వారోత్సవాలు సందర్భంగా అవగాహన సదస్సు వరంగల్ జిల్లా డీసిఎస్ఓ కిష్టయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ వినియోగదారుల సమస్యలకు అధికారులు తక్షణమే చర్యలు తీసుకుంటారనీ ముఖ్యంగా ఇప్పుడున్న సమస్య గ్యాస్ అనేది ఇండ్లలోని గ్యాస్ కు కొదవలేదని వాణిజ్య గ్యాస్ మాత్రమే కొంత నియంత్రణతో పంపిణీ జరుగుతున్నదని ప్రజలు ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని అన్నారు. అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీ గణేష్ మాట్లాడుతూ అన్ని అనారోగ్య సమస్యలకు తెల్లని ఆహార పదార్థాలు మూల కారణమని మళ్లీ మనం పూర్వపు ఆహార పద్ధతులు అనగా సిరి ధాన్యాలు వేపుడు లేని పదార్థాలు తిని ఆరోగ్యాలు కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఫుడ్ ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ మనోహర్ ఆర్టికల్చర్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు డిఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు లు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డిసిఐసి జిల్లా వినియోగదారుల కేంద్రం గిరి గాని సుదర్శన్ గౌడ్, దామోదర్,యుగంధర్ శ్రీనివాసరావు,కాళిదాసు పూర్ణచందర్,సత్యనారాయణ బేజ్జంకి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.


## తెలంగాణ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన వడ్డెర సంఘం అధ్యక్షులు ఇరగదిండ్ల కృష్ణ



దేవరకొండ , మార్చి 18 (పోలీస్ నిఘా) : నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గ వడ్డెర సంఘం అధ్యక్షులు ఇరగదిండ్ల కృష్ణ రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా నియోజకవర్గ ప్రజలకు మరియు వడ్డెర సోదర సోదరీమణులకు శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "తెలుగు వారి తొలి పండుగ ఉగాది అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని కోరుకుంటున్నాను. ఈ పరాభవ నామ సంవత్సరంలో ప్రకృతి కరుణించి, సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను" అని తెలిపారు. ఈ కొత్త ఏడాదిలో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని భగవంతుడిని ప్రార్థించారు.




## అల్లు వారసుడు శిరీష్ సెకెండ్ ఇన్నింగ్స్!



నిర్మాత అల్లు అరవింద్ వారసుడిగా ఎంట్రీ ఇచ్చిన అల్లు శిరీస్ సినీ ప్రయాణం గురించి చెప్పాల్సిన పనిలేదు. 'గౌరవం' నుంచి 'బడ్డీ' వరకు చేసిన ప్రయత్నాలేవి ఆశించిన స్థాయిలో సక్సెస్ మాత్రం కాలేదు. 13–15 ఏళ్ల నట ప్రయాణంలో నటుడిగా అతడు పెద్దగా సాధించింది ఏదీ లేదు. అయితే ఇకపై శిరీష్ జర్నీ ఎలా ఉంటుంది అన్నది ఆసక్తికరం. నైనికా రెడ్డితో శిరీష్ వివాహం జరగడంతో సెకండ్ ఇన్నింగ్స్ కు శ్రీకారం చుట్టాడు. ఓసారి ఆ వివరాల్లోకి వెళ్తే..శిరీష్ 'శ్రీరస్తు శుభమస్తు', 'ఒక్కక్షణం', 'ఊర్వశివో రాక్షసివో' వంటి సినిమాలతో ప్రత్యేకమైన గుర్తింపు దక్కింది. కానీ సక్సెస్ రేసులో మాత్రం వేల మైళ్ల దూరంలోనే ఉన్నాడు. ఇప్పటికీ స్టార్ ఇమేజ్ కోసం ఇంకా పోరాడుతూనే ఉన్నాడు. హీరో పాత్రలకే పరిమితం కాకుండా ఓ సినిమాలో కీలక పాత్రల్లోనూ మెప్పించాడు. కానీ ఆ పాత్రల్ని తదుపరి కొనసాగించలేదు. ప్రస్తుతం 'మగజాతి ఆణిముత్యం' అనే సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమాపై మాత్రం చాలా ఆశలు పెట్టుకున్నాడు. అయితే ఈ సినిమాతో శిరీష్ జాతకం కూడా మారాల్సిందే. అంతే కాదు వివాహం కూడా కొందరికి కలిసొస్తుంది. కొన్ని రకాల బాధ్యతల్ని కూడా పెంచుతుంది. మరి నైనికతో వివాహం శిరీష్ లో ఏ రకమైన మార్పులు తెచ్చిందో. పెళ్లి తర్వాత జరిగిన ఓ ఇంటర్వ్యూలో శిరీష్ మాత్రం ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. 'గతంలో ఒంటరిగా ఉన్నప్పుడు సంపాదనపై పెద్దగా ఒత్తిడి ఉండేది కాదు. కానీ ఇప్పుడు ఒక కుటుంబానికి బాధ్యత వహించాల్సిన సమయం వచ్చింది. అందుకే కెరీర్ పట్ల నాలో కసి, ఆశయం మరింత పెరిగాయన్నాడు. ఈ వ్యాఖ్యలను బట్టి చూస్తే శిరీష్ సెకండ్ ఇన్నింగ్స్‌ను చాలా సీరియస్‌గా తీసుకోబోతున్నారని అర్థమవుతోంది. మరోవైపు శిరీష్ కేవలం కెమెరా ముందుకే పరిమితం అవుతారా? లేక తన తండ్రి అల్లు అరవింద్‌లా నిర్మాణ రంగంలోకి అడుగు పెడతారా? అన్న చర్చ కూడా జరుగుతోంది. 'గీతా ఆర్ట్స్', 'ఆహా' ఓటీటీ తాజాగా ప్రారంభించిన 'అల్లు సినిమాస్' వంటి భారీ వ్యాపార సామ్రాజ్యం ఉండటంతో, భవిష్యత్తులో శిరీష్ నిర్మాణ లేదా వ్యాపార బాధ్యతలను స్వీకరించే అవకాశాలు లేకపోలేదు. ఇటీవల అల్లు సినిమాస్ ప్రారంభోత్సవంలో ఆయన సరదాగా చేసిన 'నేను రిటైర్ అయిపోయిన వాణ్ణి' అన్న వ్యాఖ్యల్లో సీరియస్ నెస్ ఎంతో తెలియాలి. ఇప్పటికే తాతయ్య రామానాయుడు, తండ్రి సురేష్ బాబు వారసత్వాన్ని నిర్మాతగా రానా కొనసాగిస్తున్నాడు. అలా శిరీష్ అరవింద్ వారసత్వంతో నిర్మాతగా ఎంట్రీ ఇచ్చే అవకాశాలైతే ఎక్కువగానే కనిపిస్తున్నాయి.

## నాలుగు కథలకు డైరెక్టర్లను సెట్ చేసే పనిలో హీరో!



ప్రస్తుతం ఎనర్జిటిక్ స్టార్ రామ్ తన కెరీర్‌లో అత్యంత కీలకమైన దశలో ఉన్నారు. వరుసగా వైవిధ్యమైన సినిమాలు చేస్తున్నప్పటికీ, బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయి కమర్షియల్ సక్సెస్ మాత్రం ఆయనకు పడటం లేదు. ఆమధ్య రిలీజ్ అయిన ' ఆంధ్రా కింగ్ తాలూకా' తోనైనా బౌన్స్ బ్యాక్ అవుతాడనుకుంటే ఆ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. హిట్ టాక్ తెచ్చుకుంది. కానీ కలెక్షన్ల పరంగా మాత్రం చిత్ర యూనిట్‌ను పూర్తిస్థాయిలో సంతృప్తి పరచలేదు. ఈ నేపథ్యంలో రామ్ రూటు మార్చి పక్కా కమర్షియల్ బ్లాక్ బస్టర్ కోసం ప్లానింగ్‌తో బరిలోకి దిగుతున్నాడు. రామ్ పోతినేనికి తొలి నుంచీ ఓ ప్రత్యేకమైన అలవాటు ఉంది. తనకు నచ్చిన కథలను, విభిన్నమైన పాయింట్లను ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి తన స్టోరీ బ్యాంక్లో భద్రపరుచుకుంటాడు. సినిమా సినిమాకు మధ్య గ్యాప్ వచ్చినా తన దగ్గర ఉన్న కథల్లో ఏది సమయానికి సరిపోతుందో దాన్ని పట్టాలెక్కించడం ఆయన స్టైల్. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం ప్రస్తుతం రామ్ వద్ద నాలుగు కథలు సిద్ధంగా ఉన్నాయని తెలిసింది. ఈ కథలు విభిన్న జోనర్లకు చెందినవి అట. దీంతో రామ్ టార్గెట్ ఫిక్స్ అయింది. తన దగ్గర ఉన్న నాలుగు కథలకు సరైన దర్శకులను సెట్ చేయడం. ప్రస్తుతం రామ్ ఆ పనిలోనే ఉన్నట్లు తెలిసింది. కథ ఎంత బాగున్నా దాన్ని వెండితెరపై ఆవిష్కరించే దర్శకుడు సమర్థుడైతేనే ఫలితం అద్భుతంగా ఉంటుంది. అందుకే ఏ దర్శకుడు ఏ కథకు న్యాయం చేయగలరు అనే కోణంలో రామ్ తీవ్రంగా కసరత్తు చేస్తున్నాడుట. ఇప్పటికే కొంతమంది సీనియర్ దర్శకులతో పాటు, కొత్త తరం ఆలోచనలున్న కుర్ర డైరెక్టర్లతో కూడా ఆయన చర్చలు జరుపుతున్నట్లు ఫిలిం నగర్ టాక్ నడుస్తోంది. గత కొన్నాళ్లుగా వరుస ఫ్లాపులు పలకరిస్తుండటంతో రామ్ ఇప్పుడు రిస్క్ తీసుకోవడానికి సిద్ధంగా లేదు. అందుకే తన స్టోరీ బ్యాంక్‌లోని ఆ నాలుగింటిలో ఏది అత్యంత పవర్‌ఫుల్ కమర్షియల్ ఎలిమెంట్స్ కలిగి ఉందో దాన్నే ముందుగా సెట్స్ పైకి తీసుకెళ్లే అవకాశం ఉంది. మాస్ ఆడియన్స్‌ను మెప్పించే అంశాలు, పక్కా ఎంటర్టైన్మెంట్ ఉన్న కథకు ప్రాధన్యత ఇవ్వనున్నాడు. ఇలా హీరో స్వయంగా కథలను ఎంచుకుని వాటికి తగిన దర్శకులను వెతకడం అనేది అతడికి సినిమాపై ఉన్న అంకితభావాన్ని చాటిచెబుతోంది. 'ఇస్మార్ట్ శంకర్' వంటి సెన్సేషనల్ హిట్ తర్వాత మళ్ళీ అలాంటి మేజిక్ రిపీట్ కాలేదు. దీంతో ఈసారి ప్రయోగాలు పక్కన పెట్టి బాక్సాఫీస్‌ను షేక్ చేసే బొమ్మనే దించాలని కంకణం కట్టుకున్నాడు. ఈ నాలుగు కథల్లో ఒకదానితో త్వరలోనే ఒక క్రేజీ అనౌన్స్‌మెంట్ వచ్చే అవకాశం ఉంది. రామ్ పోతినేని ప్లానింగ్ చూస్తుంటే ఈసారి ఆయన కొట్టే దెబ్బ మామూలుగా ఉండదనిపిస్తోంది. కమర్షియల్ హిట్ అనేది ఇప్పుడు ఆయన కెరీర్‌కు బూస్ట్ లాంటిది. తన సొంత కథా బలంతో రామ్ ఎలాంటి సంచలనం సృష్టిస్తాడో చూడాలి.

## నిఖిల్ 'స్వయంభూ'.. సౌండ్ పెంచాల్సిందేనా?




టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా స్వయంభూపై అభిమానుల్లో ఆసక్తి రోజురోజుకీ పెరుగుతోంది. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రూపొందుతున్న ఆ భారీ చిత్రాన్ని 2026 సమ్మర్ కానుకగా విడుదల చేయాలని మూవీ టీమ్ లక్ష్యంగా పెట్టుకుంది. ఏప్రిల్ 17న ప్రపంచవ్యాప్తంగా ఆ సినిమాను విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు ఇప్పుడు తెలుస్తోంది. రిలీజ్‌కు ఇంకా కొద్ది సమయం మాత్రమే ఉండటంతో మూవీ టీమ్ ప్రమోషన్స్‌ను స్పీడప్ చేసింది. ఇటీవల గుంటూరులోని ఒక ఇంజనీరింగ్ కాలేజీలో నిఖిల్ సందడి చేశారు. వేలాది మంది విద్యార్థులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిఖిల్ స్టేజ్ పై విద్యార్థులతో కలిసి స్వయంభూ పాటకు డ్యాన్స్ చేయడం ఆకట్టుకుంది. ఆ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే సినిమా మీద మంచి అంచనాలు ఉన్నప్పటికీ, మరింత స్ట్రాంగ్ ప్రమోషనల్ కంటెంట్ అవసరమని ఫ్యాన్స్ ఇప్పుడు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా టీజర్లు, ట్రైలర్లు, పాటలు వంటి అంశాల్లో మరింత హైప్ క్రియేట్ చేయాలని కోరుతున్నారు. సమ్మర్ సీజన్ లో అనేక భారీ సినిమాలు విడుదలవుతున్న నేపథ్యంలో స్వయంభూ ప్రత్యేకంగా నిలవాలంటే మేకర్స్ సౌండ్ పెంచాల్సిందేనని అభిప్రాయపడుతున్నారు. ఇక సినిమా విషయానికొస్తే.. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్ పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న స్వయంభూ చిత్రానికి ఠాగూర్ మధు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో గ్రాండ్ గా విడుదలకు సిద్ధమవుతున్న ఆ సినిమా.. నిఖిల్ కెరీర్ లోనే అత్యంత భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న ప్రాజెక్ట్‌గా నిలుస్తోంది. ముఖ్యంగా కేజీఎఫ్ ఫేం రవి బస్రూర్ సంగీతం అందిస్తుండడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తుండగా.. సినిమాలో నిఖిల్ ఓ పవర్ ఫుల్ యోధుడి పాత్రలో కనిపించనుండడం విశేషం. ఇప్పటికే విడుదలైన పోస్టర్లలో ఆయన లుక్‌కు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. చారిత్రక నేపథ్యంతో కూడిన యుద్ధ సన్నివేశాలు, భారీ సెట్స్, విజువల్ ఎఫెక్ట్స్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని టాక్ వినిపిస్తోంది. కార్తికేయ 2 విజయంతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు పొందిన నిఖిల్, స్వయంభూతో మరోసారి ఆ రేంజ్ ను దాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కనిపిస్తోంది. గత రెండేళ్లుగా నాన్ స్టాప్ గా షూటింగ్ జరుపుకుంటున్న ఆ సినిమా.. ముఖ్యంగా వీఎఫ్ఎక్స్ పనులు కారణంగా పలుమార్లు వాయిదా పడింది. ప్రస్తుతం ఆ వర్క్స్ చివరి దశలో ఉన్నాయని సమాచారం. మరి ఆడియన్స్ అంచనాలను మేకర్స్ ఎలా అందుకుంటారో.. ఎలాంటి సర్ప్రైజ్ లు ప్లాన్ చేస్తారో అన్నది అంతా వేచి చూడాలి.

## తమన్నా బాలీవుడ్‌కే పరిమితమా?



మిల్కీ బ్యూటీ తమన్నా బాలీవుడ్‌కి వెళ్లినా... సౌత్ సినిమాలో మధ్యలో కనిపించడం మాత్రం ఆపలేదు. వచ్చిన అవకాశాలను తెలివిగా సద్వినియోగం చేసుకుంది. తాజాగా అమ్మడి లైనప్ చూస్తే కెరీర్ ఆసక్తికరమైన మలుపు తిరుగుతోందా అన్న సందేహం మొదలైంది. దశాబ్ద కాలానికి పైగా సౌత్ ఇండియాలో ముఖ్యంగా టాలీవుడ్‌లో అగ్ర హీరోయిన్‌గా వెలిగిన భామ 2026లో మాత్రం పూర్తిగా బాలీవుడ్‌కే పరిమితం కాబోతున్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం ఆమె చేతిలో ఉన్న ప్రాజెక్టులన్నీ దాదాపు హిందీ చిత్రాలే . దక్షిణాదిలో కొత్త సినిమాలేవీ కమిట్ అయినట్లు కనిపించలేదు. దీంతో అమ్మడు మకాం పూర్తిగా ముంబైకి మార్చేసిందా అన్న చర్చ మొదలైంది. ప్రస్తుతం తమన్నా బాలీవుడ్‌లో వరుస పెట్టి క్రేజీ ప్రాజెక్టులు చేస్తోంది. షాహిద్ కపూర్‌తో కలిసి నటిస్తోన్న ఓరోమియో ఆన్ సెట్స్ లో ఉంది. అలాగే సిద్ధార్థ్ మల్హోత్రాతో కలసి 'వాన్' లోనూ నటించింది. ఈ సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఇవి కాకుండా అజయ్ దేవగన్, సంజయ్ దత్ వంటి స్టార్ హీరోల సరసన రెంజర్ వంటి భారీ చిత్రాల్లోనూ ఛాన్స్ అందుకుంది. ఇవిగాక మరో రెండు మూడు చిత్రాలకు కమిట్ అవుతుందనే వార్తలు అంతకంతకు వేడెక్కిస్తున్నాయి. అంటే 2026 క్యాలెండర్ మొత్తం తమన్నా బాలీవుడ్ సినిమాలతో నిండినట్లే. ఒకప్పుడు తెలుగు, తమిళ భాషల్లో ఏడాదికి నాలుగైదు సినిమాలైనా అమ్మడు రిలీజ్ చేసేది. కానీ ఇప్పుడు అదే సౌత్ సినిమాలకు గ్యాప్ తీసుకోవడం ఆసక్తికరంగా మారింది. ఇక్కడ రకరకాల కారణాలను విశ్లేషించొచ్చు. అవకాశాలు రాకపోవడం వల్ల కాకపోవచ్చు లేదా.. వచ్చినా హిందీ చిత్రాలతో బిజీగా ఉండటం వల్ల అయినా డేట్లు కేటాయించలేకపోవచ్చు. తెలుగులో అమ్మడు చివరగా చేసిన సినిమాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడం కూడా ఒక కారణం కావొచ్చు. బాలీవుడ్ మేకర్స్ ఆమెలోని నటిని కొత్త కోణంలో ఆవిష్కరిస్తూ విభిన్నమైన పాత్రలు ఆఫర్ చేస్తుండటంతో హిందీ ప్రాజెక్టులకే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అలాగే ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ పైన కూడా తమన్నా బాలీవుడ్ వెబ్ సిరీస్‌లతోనే బిజీగా ఉంది. గతంలో ఆమె నటించిన హిందీ సిరీస్‌లకు మంచి గుర్తింపు రావడంతో అక్కడ ఆమెకు భారీ రెమ్యునరేషన్ తో పాటు ప్రాధాన్యత ఉన్న పాత్రలు లభిస్తున్నాయి. ఈ క్రమంలోనే దక్షిణాది నుంచి వస్తున్న సాధారణ కమర్షియల్ సినిమాల కంటే, బాలీవుడ్‌లో కంటెంట్ ఉన్న చిత్రాలకే ఆమె ఓటు వేస్తోందని చెప్పొచ్చు. ఇప్పటి వరకూ కమిట్ అయిన హిందీ చిత్రాలు చూస్తే 2026 సంవత్సరం తమన్నా కెరీర్‌లో హిందీ ఇయర్ అని చెప్పొచ్చు. అలాగని పూర్తిగా సౌత్ సినిమాలకు దూరంగా కాదు. సరైన అవకాశాలు వచ్చాయంటే కాదనకుండా పనిచేస్తుంది. అందులో ఎఆంటి సందేహం లేదు. ఎందుకంటే తమన్నా ఒకే భాషకు పరిమితమై పనిచేసే నటి కాదు. అమ్మడి ముందు అన్ని భాషలు సమానమే.

## ఫాంటసీ కామెడీతో వస్తున్న రాకాస





మెగా కూతురు నిహారిక కొణిదెల నిర్మాతగా తన రెండో సినిమా 'రాకాస'తో బాక్సాఫీస్ వద్ద సౌండ్ చేసేలా కనిపిస్తున్నారు. ఈ సినిమా తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ హక్కులను ప్రముఖ సంస్థ శ్రీ లక్ష్మి నరసింహ మూవీ మేకర్స్ భారీ ధరకు దక్కించుకుంది. ఏప్రిల్ 3న విడుదల కాబోతున్న ఈ ఫాంటసీ కామెడీ చిత్రంపై ఇండస్ట్రీలో మంచి పాజిటివ్ బజ్ ఉండటంతో, డిస్ట్రిబ్యూటర్లు పోటీ పడి మరీ హక్కులను కొనుగోలు చేశారు. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా, ఓవర్సీస్ లో కూడా సుమారు 350కి పైగా స్క్రీన్లలో ఈ సినిమాను గ్రాండ్ గా రిలీజ్ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నిహారిక తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ పై జీ స్టూడియోస్‌తో కలిసి ఈ ప్రాజెక్టును నిర్మించారు. సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించిన ఈ చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, గ్లింప్స్ సోషల్ మీడియాలో మిలియన్ల వ్యూస్ సాధించి సినిమాపై క్యూరియాసిటీని పెంచాయి. ముఖ్యంగా 'మ్యాడ్' సినిమాలతో యూత్ లో మంచి క్రేజ్ సంపాదించుకున్న సంగీత్ శోభన్, ఈ సినిమాలో తన మార్కు కామెడీతో అలరించబోతున్నాడని ప్రమోషన్లు చూస్తుంటే అర్థమవుతోంది. సినిమా విడుదలకు ముందే డిజిటల్ ఆడియో హక్కుల విషయంలో కూడా 'రాకాస' సత్తా చాటింది. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకోగా, ఆడియో హక్కులను సరిగమ మ్యూజిక్ దక్కించుకుంది. అనుదీప్ దేవ్ అందించిన పాటలు ఇప్పటికే చార్ట్‌బస్టర్‌లుగా నిలిచాయి. 'రపప్ప', 'పదే పదే' వంటి సాంగ్స్ యూట్యూబ్ లో మిలియన్ల వ్యూస్ తో దూసుకుపోతున్నాయి. సంగీతపరంగా సినిమాకు మంచి ఆదరణ లభించడం బిజినెస్ పరంగా చిత్రానికి పెద్ద ప్లస్ పాయింట్ అయ్యింది. వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, తనికెళ్ల భరణి వంటి భారీ తారాగణం ఉండటం వల్ల వినోదానికి ఎక్కడా లోటుండదని తెలుస్తోంది. హారర్, ఫాంటసీ అంశాలను కామెడీకి జోడించి దర్శకురాలు మానస శర్మ ఈ కథను కొత్తగా తెరకెక్కించారు. ఏప్రిల్ 2వ తేదీనే అమెరికా, యూకే వంటి దేశాల్లో ప్రీమియర్లు పడబోతున్నాయి. ప్రత్యాంగిర సినిమాస్ నార్త్ అమెరికాలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తోంది. ఓవర్సీస్ మార్కెట్ లో కూడా పక్కా ప్లానింగ్ తో వెళ్తున్నారు. ఇక నిహారిక నిర్మాతగా తన మొదటి సినిమా 'కమిటీ కుర్రోళ్లు'తో సక్సెస్ అందుకున్న జోరును ఇప్పుడు 'రాకాస'తో కూడా కొనసాగించేలా కనిపిస్తున్నారు. బాక్సాఫీస్ వద్ద ఈ ఫాంటసీ డ్రామా ఎటువంటి ప్రభంజనం సృష్టిస్తుందో చూడాలి. కేవలం రెగ్యులర్ కథతో కాకుండా, బలమైన విజువల్స్ టెక్నికల్ వాల్యూస్‌తో ఈ సినిమాను రూపొందించినట్లు చెబుతున్నారు. వచ్చే నెలలో థియేటర్లకు రాబోతున్న ఈ సినిమా ప్రేక్షకులకు ఎటువంటి కొత్త అనుభూతిని ఇస్తుందో వేచి చూడాలి.

# టీ కాంగ్రెస్‌లో బీసీ వర్సెస్ రెడ్డి

## చిచ్చు రాజేసిన మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు

హైదరాబాద్, మార్చి 18 (పోలీస్ నిఘా) : తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. పార్టీ సీనియర్ నేత జగ్గారెడ్డి మాస్ లీడర్ అని ఆయనకు పీసీసీ ఇస్తే వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు సాధిస్తామంటూ మాస్ ఎలివేషన్స్ ఇచ్చారు. ఓ వైపు అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్న వేళ ప్రతిపక్షాల విమర్శలకు చెక్ పెట్టాల్సిన అధికార పార్టీలో, ఉన్నట్టుండి పీసీసీ మార్పు అంశం చర్చకు రావడం ఆసక్తిగా మారింది. దాంతో ప్రస్తుత పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ పరిస్థితి ఏంటి? అంటూ బీసీ నేతలు కోమటిరెడ్డి వ్యాఖ్యలపై మండిపడుతున్నారు.



**రెడ్డి వర్సెస్ బీసీ:**

మంత్రి కోమటిరెడ్డి కామెంట్స్ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో రెడ్డి వర్సెస్ బీసీ అనే వివాదానికి తెరలేపినట్లైంది. ప్రస్తుతం బీసీ వర్గానికి చెందిన మహేశ్ కుమార్ గౌడ్ పీసీసీగా కొనసాగుతున్న తరుణంలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన జగ్గారెడ్డిని పీసీసీ చేయాలని అలా చేస్తే వంద సీట్లు సాధిస్తామని చిట్ చాట్ లో చెప్పడాన్ని బీసీ నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారు. ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్, కాంగ్రెస్ నేత ఈరవత్రి అనిల్ స్పందిస్తూ సొంత పార్టీపై కోమటిరెడ్డి వ్యాఖ్యలు దురదృష్టకరం అన్నారు. మంత్రి వ్యాఖ్యలు బీసీ నాయకత్వాన్ని కించపర్చడమేనని బీసీల పట్ల ఎందుకంత వివక్ష అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ నిన్ను మంత్రిని చేస్తే కీలకమైన హోదాలో ఉండి ఇలాంటి పిచ్చి పిచ్చి స్టేట్‌మెంట్లు ఇస్తూ పార్టీ పరువు తీస్తున్నారని సొంత పార్టీ మద్దతుదారులే సోషల్ మీడియాలో విమర్శలు గుప్పిస్తున్నారు. గతంలో రేవంత్ రెడ్డిపైనే తీవ్ర ఆరోపణలు చేసిన కోమటిరెడ్డి ఇప్పుడు ఆయన కేబినెట్ లోనే ఉంటూ బీసీలను అవమానించేలా మాట్లాడుతున్నారని మండిపడుతున్నారు.

**హెచ్చరించినా అదే దారి:**

తాజా పరిణామాల నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన మొదటి రోజే పార్టీ సభ్యులను సీఎం రేవంత్ రెడ్డి అప్రమత్తం చేశారు. సీఎల్పీ సమావేశంలో దిశానిర్దేశం చేస్తూ అనవసర వివాదాల జోలికి వెళ్లవద్దని, పార్టీ, ప్రభుత్వ పరమైన లైన్‌లోనే అందరూ స్పందించాలని సూచించారు. అయినా మంత్రి కోమటిరెడ్డి మాత్రం జగ్గారెడ్డి విషయంలో చేసిన వ్యాఖ్యలు సొంత పార్టీలోనే చిచ్చురాజేసినట్లైంది.

**నా ఉద్దేశం అది కాదు:**

తన వ్యాఖ్యలు పార్టీలో వివాదానికి దారి తీస్తుండటంతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పంది ంచారు. మహేశ్ కుమార్ గౌడ్‌పై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదన్నారు. మహేశ్ కుమార్ గౌడ్ సారథ్యంలోనే గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించామని చెప్పారు. రంజాన్ వేడుకలకు జగ్గారెడ్డి ఏర్పాట్లు బాగున్నాయి. అందుకే పీసీసీ చీఫ్ అయితే బాగుంటుందని మాత్రమే అన్నారు. ఇప్పుడున్న పీసీసీని తొలగించాలనేది ఉద్దేశం కాదు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

# ఐదు రకాల బస్సుల్లో దివ్యాంగులు ఉచితంగా ప్రయాణించొచ్చు

## దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించిన ఏపీ సీఎం చంద్రబాబు

మంగళగిరి, మార్చి 18 (పోలీస్ నిఘా) : దివ్యాంగ శక్తి పథకం ద్వారా లక్షల మందికి మేలు జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. దివ్యాంగ శక్తి ద్వారా 12.75 లక్షల మందికి ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. దివ్యాంగుల గౌరవాన్ని పెంచేందుకు ఈ పథకం అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. బుధవారం దివ్యాంగ శక్తి పథకాన్ని సీఎం ప్రారంభించారు. అనంతరం దివ్యాంగులతో కలిసి చంద్రబాబు, మంత్రి లోకేశ్ భోజనం చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగ శక్తి పథకంపై లబ్ధిదారులతో సీఎం మాట్లాడారు.



**ప్రజాసంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు..**

ప్రజాసంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని సీఎం చంద్రబాబు వివరించారు. ఇవాళ ప్రారంభించిన ఈ దివ్యాంగ శక్తి పథకం తనకు ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని కలిగిస్తోందని చెప్పుకొచ్చారు. తాను, పవన్ కల్యాణ్, లోకేశ్ కలిసి ఈ పథకాన్ని ప్రారంభించి దివ్యాంగులతో ప్రయాణించటం ఆనందంగా ఉందని అన్నారు. దివ్యాంగులు అంటే విభిన్న ప్రతిభావంతులు, సమస్యను అధిగమించి విజయాలు సాధించే శక్తి ఉన్న వారని తెలిపారు. గతంలో 'చేయూత' కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు సహాయం చేశామని ప్రస్తావించారు. ట్రై సైకిళ్లతో పాటు దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం నింపడానికి టూ వీలర్లను అందించామని గుర్తుచేశారు. రూ.500 ఉండే దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచి ఇస్తున్నామని స్పష్టం చేశారు. తీవ్ర ఆరోగ్య ఇబ్బందుల్లో ఉండే దివ్యాంగులకు రూ.10 వేలు, మంచానికి పరిమితమైన వారికి రూ.15 వేలు ఇస్తున్నామని తెలిపారు. ప్రతి ఏడాది పింఛన్ల కోసం రూ.33 వేల కోట్లు ఖర్చుచేస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**దివ్యాంగుల కోసం మరిన్ని కార్యక్రమాలు..**

తమ ప్రభుత్వంలో ఇప్పుడు ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఎలాంటి ఛార్జీలు లేకుండా ఐదు రకాల బస్సుల్లో దివ్యాంగులు ఉచితంగా ప్రయాణించవచ్చని అన్నారు. ఈ సౌకర్యం ద్వారా నెలకు ఒక్కొక్కరికీ రూ.2 వేల దాకా దివ్యాంగులకు ఆదా అయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. మొదటి నుంచి దివ్యాంగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. భవిష్యత్తులోనూ దివ్యాంగులను ఆదుకునేలా మరిన్ని కార్యక్రమాలు అమలు చేస్తామని చెప్పుకొచ్చారు. దివ్యాంగ శక్తి పథకంతో ఈ ఉగాది మరింత ఆనందంగా చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలు చేసే ఏ పథకం, ఏ కార్యక్రమమైనా నిరుపేదల సంక్షేమం కోసమేనని చెప్పుకొచ్చారు. దివ్యాంగులకు అండగా నిలబడాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. మహిళల స్త్రీ శక్తి పథకం ద్వారా ఇప్పటి వరకూ 52 కోట్ల ప్రయాణాలు జరిగాయని ప్రస్తావించారు. దివ్యాంగ సమస్యలపై ఎప్పుడూ పోరాటాలు చేసే మందకృష్ణ మాదిగ, గోనుగుంట్ల కోటేశ్వరావులను తాను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.




# టాప్-5 బ్యాటర్లలో భారత్ నుంచి ముగ్గురు

## -బౌలర్లలో ముందుకొచ్చిన బుమ్రా-




అత్యుత్తమ ఆటగాళ్ల ర్యాంకులను తాజాగా ఐసీసీ ప్రకటించింది. టీ20 ప్రపంచ కప్ తర్వాత భారత్‌కు చెందిన ఆటగాళ్లు ఏ మ్యాచ్‌లోనూ ఆడలేదు. అయితే, టీ20 బౌలింగ్ విభాగంలో స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఒక ర్యాంకును మెరుగుపర్చుకుని టాప్-5లోకి వచ్చాడు. రషీద్ ఖాన్ (753), వరుణ్ చక్రవర్తి (740) తొలి రెండు స్థానాల్లో నిలిచారు. బుమ్రా (702) ఐదో ర్యాంక్‌కు చేరాడు. ఇక బ్యాటింగ్ జాబితాలో ఎలాంటి మార్పులు లేవు. భారత ఎడమచేతి వాటం బ్యాటర్లు అభిషేక్ శర్మ (875), ఇషాన్ కిషన్ (871) తొలి రెండు స్థానాలను పదిలం చేసుకున్నారు. తిలక్ వర్మ (742) ఒక్క ర్యాంకు ముందుకొచ్చి ఆరో స్థానానికి చేరాడు. పొట్టికప్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' సంజు శాంసన్ (636) కూడా ఒక్క స్థానం మెరుగుపర్చుకుని 21వ ర్యాంకులో ఉన్నాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో జింబాబ్వే ఆటగాడు సికందర్ రజా, భారత స్టార్ ప్లేయర్ హార్దిక్ పాండ్యవే తొలి రెండు స్థానాలు. ఈ వారం రోజుల వ్యవధిలో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ జట్లు మాత్రమే టీ20లను ఆడాయి.

**వన్డేల్లో వారు..**

వన్డే ర్యాంకుల్లో భారత ఆటగాళ్లదే హవా. ఇటీవల వన్డేలను ఆడకపోయినా సరే.. బ్యాటర్ల విభాగంలో విరాట్ కోహ్లీ (2), రోహిత్ శర్మ (4), శుభ్‌మన్ గిల్ (5) టాప్-5లో కొనసాగుతున్నారు. డారిల్ మిచెల్ అగ్రస్థానంలో ఉన్నాడు. పాకిస్థాన్‌పై వన్డే సిరీస్‌ను గెలిపించిన బంగ్లా సారథి మెహిదీ హసన్ మిరాజ్ బౌలర్ల లిస్ట్‌లో తొమ్మిది స్థానాలను ఎగబాకి ఏడో ర్యాంకుకు చేరాడు. ఈ జాబితాలో భారత్ నుంచి కుల్‌దీప్ యాదవ్ ఒక్కడే 8వ స్థానంతో టాప్-10లో ఉన్నాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో మిరాజ్ రెండు స్థానాలు పైకొచ్చి రెండో ర్యాంకులో నిలిచాడు. ఇక్కడ మాత్రం టాప్-10లో టీమ్‌ఇండియా నుంచి అక్షర్ పటేల్ పదో ర్యాంకుతో కొనసాగుతున్నాడు. జట్లపరంగా టెస్టు ర్యాంకింగ్స్‌లో నాలుగో స్థానంలో ఉన్న భారత్.. వన్డే, టీ20 ఫార్మాట్లలో అగ్రస్థానంలో ఉంది.

## ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్... అగ్రస్థానంలోనే స్మృతి మంధాన





మహిళల జట్టు వన్డే ర్యాంకింగ్స్ జాబితాను ఐసీసీ తాజాగా విడుదల చేసింది. టీమిండియా స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన 790 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలోనే కొనసాగుతోంది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ ఓ స్థానాన్ని మెరుగుపరుచుకుని 652 పాయింట్లతో ఏడో స్థానానికి ఎగబాకింది. మరో స్టార్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ 635 పాయింట్లతో 12వ స్థానంలోనే ఉంది. తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్ జాబితాలో టాప్ 6 బ్యాటర్ల స్థానాల్లో ఎలాంటి మార్పు లేదు. స్మృతి తర్వాతి స్థానంలో సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్(782), ఆసీస్ వికెట్ కీపర్ బెత్ మూనీ(749), ఆసీస్ బ్యాటర్ ఆష్లీ గార్డ్‌నర్(724), ఇంగ్లండ్ ప్లేయర్ నాట్‌సీవర్ బ్రంట్(714), ఆసీస్ బ్యాటర్ ఫోబ్ లిచ్‌ఫీల్డ్(674) పాయింట్లతో కొనసాగుతున్నారు. బౌలింగ్ విభాగంలో ఆసీస్ బౌలర్ అలానా కింగ్ 775 పాయింట్లతో అగ్రస్థానాన్ని పదిలపర్చుకున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో సోఫీ ఎకిల్‌స్టన్(747), ఆష్లీ గార్డ్‌నర్(713) ఉన్నారు. టీమిండియా స్టార్ దీప్తి శర్మ 614 పాయింట్లతో పదో స్థానంలో కొనసాగుతోంది.

**టీ20 ఫార్మాట్‌లో..**

ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ బ్యాటింగ్ జాబితాలో ఆసీస్ వికెట్ కీపర్ బెత్ మూనీ 787 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆ తర్వాతి స్థానంలో టీమిండియా స్టార్ స్మృతి మంధాన(770), హెలీ మ్యాథ్యూస్(765) తమ స్థానాలను పదిలపర్చుకున్నారు. బౌలింగ్ విభాగంలో టాప్ 8 స్థానాలు పదిలంగా ఉన్నాయి. అగ్రస్థానంలో పాక్ పేసర్ సాదియా ఇక్బాల్(743) ఉంది. కాగా టీమిండియా బౌలర్ అరుంధతీ రెడ్డి 697 పాయింట్లతో పదో స్థానానికి ఎగబాకింది.

# అమెరికాను వీడితే 2,600 డాలర్లు


## అక్రమ వలసదారులకు ఆఫర్



వాషింగ్టన్, మార్చి 18 : స్వచ్ఛందంగా అమెరికాను వదిలివెళ్లే అక్రమ వలసదారులకు 2,600 డాలర్లు (రూ.2,40,329) ఎగ్జిట్ బోనస్ అందించనున్నట్లు ట్రంప్ యంత్రాంగం ప్రకటించింది. దీంతోపాటు వారి స్వదేశా లకు విమానంలో ఉచితంగా పంపించడానికి ఏర్పాట్లు చేస్తామని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం ఓ ప్రకటనలో తెలిపింది. తాము స్వదేశానికి తిరిగివెళ్లేందుకు సిద్ధమేనని 'సీబీపీ హోమ్' యాప్ ద్వారా ప్రభుత్వానికి తెలియజేసే వారి పేర్లను బలవంతంగా స్వదేశానికి తరలించాల్సిన వారి లిస్టు నుంచి తొలగిస్తామని తెలిపింది. అక్రమ వలసదారులను స్వదేశాలకు పంపడానికి 2025 జనవ రిలో అమెరికా చర్యలు ప్రారంభించినట్లు హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం పేర్కొంది. తాము ఇస్తున్న ఆఫర్‌లను వినియోగించుకొని.. అప్పటినుంచి ఇప్పటివరకు 22 లక్షలకు పైగా అక్రమ వలసదారులు తమ దేశాలకు తిరిగివెళ్లినట్లు వెల్లడించింది. స్వచ్ఛందంగా స్వదేశానికి తిరిగి వెళ్లడమే అక్రమంగా అమెరికాకు వచ్చినవారి ముందున్న అతి సురక్షితమైన, చవకైన మార్గమని తెలిపింది. అలా చేస్తే అరెస్టు కాకుండా కూడా ఉండొచ్చని సూచించింది.

# ఇరాన్ కోలుకోవడానికి పదేళ్లు పడుతుంది

## డొనాల్డ్ ట్రంప్



వాషింగ్టన్, మార్చి 18 : ఇరాన్‌పై ఇజ్రాయెల్-అమెరికా చేస్తున్న సంయుక్త దాడులు ఉధృతమయ్యాయి. ఈ దాడుల కారణంగా టెహ్రాన్ భారీగా నష్టపోయింది. ఓవైపు కీలక నేతలు వరుసగా ప్రాణాలు కోల్పోతుండగా మరోవైపు అణు స్థావరాలు, జనావాసాలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై కొనసాగుతున్న తమ సైనిక చర్యలు చాలా బాగా సాగుతున్నాయని, వాటివల్ల కలిగిన నష్టాన్ని పునర్నిర్మించడానికి ఇరాన్‌కు కనీసం ఒక పదేళ్లు పట్టవచ్చని ట్రంప్ అభిప్రాయపడ్డారు. 'ఇరాన్‌పై యుద్ధం చాలా బాగా సాగుతోంది. వారి(ఇరాన్) వద్ద అణ్వాయుధాలు ఉండనివ్వకూడదు. భవిష్యత్‌లో వారి నుంచి ఎవరికీ అణుముప్పు రాకూడదనేదే మా లక్ష్యం. మరో రెండు వారాల పాటు ఈ యుద్ధం కొనసాగే అవకాశం ఉంది. మేము ముందస్తు దాడులు ప్రారంభించకపోయి ఉంటే ఇరాన్ ఈ పాటికి పలు అణ్వాయుధాలను అభివృద్ధి చేసేది' అని ట్రంప్ తెలిపారు. 'ఇరాన్‌పై దాడులు ఇంకా ముగియలేదు. ఆ దేశానికి శాశ్వత నష్టం కలిగించడానికి మేము మరిన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పుడే యుద్ధాన్ని ఆపేసినా ఆ దేశాన్ని పునర్నిర్మించుకోవడానికి అక్కడి పాలకులకు 10 ఏళ్ల సమయం పడుతుంది. కానీ మరే ఇరాన్ అధ్యక్షుడు ఇలాంటి సాహసం చేసేందుకు ధైర్యం చేయకుండా, అలానే మళ్లీ కోలుకోలేనివిధంగా అక్కడి నేతలకు నష్టం కలిగించాలన్నదే మా ఉద్దేశం' అని ట్రంప్ వెల్లడించారు. ఇదే సమయంలో హోర్ముజ్ జలసంధికి యుద్ధ నౌకలను పంపడానికి నాటోతో పాటు మిత్రదేశాలు నిరాకరించడంపై ట్రంప్ అసహనం వ్యక్తంచేశారు. ఈ విషయంలో నాటో తెలివితక్కువగా ప్రవర్తిస్తోందన్నారు. హోర్ముజ్ జలసంధిని తెరిపించాల్సిన అవసరం ఉన్నప్పటికీ తమ మిత్రదేశాలు ముందుకురావట్లేదన్నారు. అయినప్పటికీ తాము వెనక్కి తగ్గే ప్రసక్తి లేదన్నారు.

# ప్రజలకు సీఎం రేవంత్ ఉగాది శుభాకాంక్షలు



న్యూఢిల్లీ, మార్చి 18 : రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఉగాది పండగ శుభాకాంక్షలు తెలిపారు. గురువారం నుంచి శ్రీ పరాభవ నామ తెలుగు సంవత్సరం ప్రారంభం కానుందంటూ కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. కొత్త ఏడాదిలో కాలం కలిసి రావాలని, సమృద్ధిగా వానలు కురిసి, పాడి పంటలతో రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని అభిలషించారు. గత ఏడాది ఉగాది పండగ రోజున రాష్ట్రంలో రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించామని సీఎం గుర్తు చేశారు. ఈ ఏడాదిలో రాష్ట్రం అన్ని రంగాల్లో మెరుగైన అభివృద్ధి సాధించి దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలు చాటిచెప్పేలా అందరూ ఉగాది పండగను సంతోషంగా జరుపుకోవాలని సీఎం కోరారు.

# మొజ్తాబా ఎక్కడున్నా వెంబడించి, అంతం చేస్తాం: ఇజ్రాయెల్

ఇజ్రాయెల్, మార్చి 18 : ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ ఆయతుల్లా మొజ్తాబా ఖమేనీ ఎక్కడ ఉన్నా వెంబడించి అంతం చేస్తామని ఇజ్రాయెల్ హెచ్చరించింది. తమ దేశానికి ముప్పుగా ఉన్నవారు ఎప్పుడూ తమ టార్గెట్‌లోనే ఉంటారని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ వెల్లడించింది. అయితే ప్రస్తుతం ఖమేనీ ఎక్కడున్నారనే దానిపై తమ వద్ద సమాచారం లేదని మీడియా అడిగిన ప్రశ్నకు ఐడీఎఫ్ ప్రతినిధి ఎఫీ డెఫ్రిన్ సమాధానం ఇచ్చారు. "ఆయన ఎక్కడున్నారన్న దానిపై మావద్ద ప్రస్తుతం సమాచారం లేదు. కానీ మా దేశానికి ముప్పుగా పరిణమించిన వారిని వెంబడించడం మాత్రం ఆపం. మాకు వ్యతిరేకంగా వ్యవహరించేవారు మా నుంచి తప్పించుకోలేరు. వారిని తరిమి, తరిమి అంతం చేస్తాం. ఎప్పుడు, ఎక్కడ అనేది ఇప్పుడే కచ్చితంగా చెప్పలేకపోయినా.. మా టార్గెట్ మాత్రం మిస్ కాదు" అని డెఫ్రిన్ వ్యాఖ్యలు చేశారు. మరోవైపు, దాడుల్లో గాయపడిన ఖమేనీని చికిత్స కోసం రష్యాకు తరలించినట్లు



వచ్చిన వార్తలను ఇరాన్ ఖండించింది. "ఇదొక కొత్తతరహా మానసిక యుద్ధం. ఇరాన్ నేతలకు పారిపోవాల్సిన, షెల్టర్లలో దాక్కోవాల్సిన అవసరం లేదు. వారు ప్రజల మధ్యే ఉంటారు" అని రష్యాలో ఇరాన్ రాయబారి కాజెమ్ జలాలీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

**కుమార్తె ఇంట్లో ఉండగా..**

ఇరాన్ అత్యున్నత సైనికాధికారి అలీ లారిజానీ, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ అనుబంధ బసీజ్ మిలీషియా అధిపతి జనరల్ గులాం రెజా సాల్మనీ ఇజ్రాయెల్ దాడుల్లో మృతి చెందారు. తమ దేశంలో అత్యంత ప్రజాదరణ ఉన్న లారిజానీ మృతిని ఇరాన్ కూడా ధ్రువీకరించింది. ఈ దాడి జరిగినప్పుడు ఆయన కుమార్తె ఇంటివద్ద ఉన్నారు. ఈ ఘటనలో ఆయనతో పాటు కుమారుడు, సహాయకులు ప్రాణాలు కోల్పోయారని సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ వెల్లడించింది.

Printed, Published & Owned by Kemoju Madhuri, Plot No.32, 3rd Floor, R.K.Nagar, Attapur, Rajendra Nagar, R.R.Dist., Telangana State, Pin Code:500043, Printed at S.V.Printers, Plot No.32,Ground Floor, R.K.Nagar, Attapur, Rajendra Nagar, R.R.Dist., Telangana State, Pin Code: 500043, Editor : Kemoju Srinivas, RNI No.TELTEL/2016/68720, e-mail: policenigah@gmail.com. Cell: 9133613813, Off: 040-35668279